



రంజాన్ వేళలు
ఇఫ్తార్ సాయంత్రం గంటల 6.22(శుక్రవారం)
సహేరీ ఉదయం గంటల5.03 (శనివారం)

విస్తరణ సాగేనా.. సమస్య తీరేనా?



వరదల్లో ఉప్పొంగి ప్రవహిస్తున్న గుండ్లకమ్మ (ఫైల్)

- నిలిచిన గుండ్లకమ్మ పనులు
- ఐదేళ్లుగా సాగని భూ సేకరణ ప్రక్రియ
- 5.2 కిలో మీటర్లకుగాను 800 మీటర్ల పనులు పూర్తి
- ఆక్రమణలకు గురైన గుండ్లకమ్మ
- పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు
- వర్షాకాలంలో ముంపు కాలనీలకు ఇబ్బందే..

ఆత్మకూరు, మార్చి 14: ఆత్మకూరు పట్టణంలో భారీ వర్షాలు కురిసిన సందర్భాల్లో నీటి ముంపు కాలనీలకు గుండ్లకమ్మ వాగు అండగా నిలుస్తోంది. వరద నీరు వాగు వెంట ప్రవహించి పట్టణ శివార్లలో ప్రవహిస్తున్న భవనాశి నదిలో కలిసి సంగమేశ్వరం వరకు ప్రవహిస్తోంది. అయితే గత కొన్నేళ్లుగా వాగులో పూడిక పేరుకు పోవడమే కాకుండా వాగుకు ఇరువైపుల ఆక్రమణలు జరిగి ప్రవాహ మార్గం కుచించుకుపోయింది. దీంతో భారీ వర్షాల సమయంలో నీటి ప్రవాహం ముందుకు సాగకుండా సమీప కాలనీలను ముంచెత్తుతోంది. ఈ కారణంగా వరదల సమయంలో వందలాది కుటుంబాలు తీవ్రంగా నష్టపోవాల్సిన దుస్థితి నెలకొంది. ఈ సమస్యలను పరిష్కరించేందుకు 2017లో అప్పటి కలెక్టర్ సీహెచ్ విజయమోహన్ చొరవతో నీరు-చెట్టు కార్యక్రమంలో భాగంగా గుండ్లకమ్మ వాగు విస్తరణ పనులకు శ్రీకారం చుట్టారు. ఇందు కోసం రూ.49 లక్షల నిధులను కేటాయించి వాగు ప్రవాహమార్గం గుండా 5.2కి.మీ. పొడవు, 10 మీటర్ల వెడల్పు, 1.1 మీటర్ల లోతుతో పనులను చేపట్టాలని నిర్ణయించారు. వాస్తవానికి భవిష్యత్ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని వాగును 20 మీటర్ల వెడల్పు చేయాలని నిర్ణయించినప్పటికీ ఇరువైపుల వందలాది గృహాలు తొలగిపోనున్న నేపథ్యంలో వెడల్పును 10 మీటర్లకు తగ్గించారు. నిర్ణయించిన ఈ పనులకు అప్పట్లో టెండర్లను ఆహ్వానించగా ఓ కాంట్రాక్టర్ రూ.27 లక్షలతో ఈ పనును చేపట్టేందుకు ముందుకొచ్చారు. అయితే పట్టణ శివార్లలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఆర్‌డీటీ గృహ నిర్మాణ సముదాయం ప్రదేశాల్లో 800 మీటర్ల మేరకు విస్తరణ పనులను చేపట్టగా పట్టణంలో ఎలాంటి పనులను ప్రారంభించలేదు. దీనికి తోడు పట్టణంలోని పలు కాలనీల గుండా ప్రవహిస్తున్న గుండ్లకమ్మ వాగు విస్తరణ కోసం సుమారు 12 ఎకరాల వరకు భూ సేకరణ చేపట్టాలని జిల్లా అధికారులకు ప్రతిపాదనలు పంపినప్పటికీ ఇప్పటి వరకు అధికారుల ఎలాంటి పురోగతి రాలేదు. దీంతో గుండ్లకమ్మ వాగు విస్తరణ పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. కాగా పట్టణ శివార్లలో ప్రవహిస్తున్న గుండ్లకమ్మ వాగును రియల్ ఎస్టేట్ వ్యాపారులు పూడ్చిచేసి ఆక్రమణలకు పాల్పడుతున్నారు. కొందరు యథేచ్ఛగా అక్రమ కట్టడాలు నిర్మించుకుంటున్నారు. ఇంతా జరుగుతున్నా సంబంధిత శాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.



ఐదేళ్ల క్రితం పట్టణ శివార్లలో 800 మీటర్ల మేర జరిగిన విస్తరణ పనులు



భారీ వర్షాలు కురిస్తే.. ముంపు కాలనీలకు ఇవే తిప్పలు (ఫైల్)

నిర్లక్ష్యం వహిస్తే.. ముంపు కాలనీలకు ముప్పే

ఆత్మకూరు పట్టణంలోని గుండ్లకమ్మవాగు విస్తరణ పనులపై పాలకులు, అధికారులు నిర్లక్ష్యం వహిస్తే.. భారీ వర్షాల సమయంలో వాగు పరిసర ప్రాంతాల్లో వున్న ముంపు కాలనీలకు ముప్పు తప్పదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వాస్తవానికి నంద్యాల టర్నింగ్ సమీపంలో పంట పొలాల నడుమ ప్రవహించే గుండ్లకమ్మ వాగు నంద్యాల - ఆత్మకూరు రహదారిని దాటి ఆత్మకూరు పట్టణంలోకి ప్రవేశిస్తోంది. అక్కడి నుంచి హుసేన్ సానగర్, రహమత్‌నగర్, లక్ష్మీనగర్, ఏకలవ్య నగర్, సాయిబాబానగర్, ఇందిరానగర్, గరీబ్ నగర్ నుంచి పట్టణ శివార్లలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఆర్డీటీ కాలనీ మీదుగా భవనాశి నదిలో కలుస్తోంది. కాగా 2017 జూన్‌లోనే ఈ పనులు పూర్తి కావాల్సి ఉన్నప్పటికీ ఐదేళ్లుగా భూసేకరణ ప్రక్రియకు అవాంతరాలు ఏర్పడి గుండ్లకమ్మ వాగు విస్తరణకు బ్రేక్ పడింది. ఇదిలావుంటే అప్పట్లో గుండ్లకమ్మ వాగు విస్తరణ పనులను చేపట్టేందుకు ఎమ్మెల్సీ హోదాలో ఉన్న శిల్పా చక్రపాణిరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. అయితే ఆ తర్వాత రాజకీయ నాయకుల ఒత్తిళ్లతో ఆయన సైతం విస్తరణపై శ్రద్ధ చూపడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

కఠినంగా వ్యవహరిస్తేనే ముంపు కాలనీలకు ప్రయోజనం

గుండ్లకమ్మ వాగు విస్తరణ పట్ల రాజకీయ నేతలు, అధికారులు కఠినంగా వ్యవహరించినప్పుడే ముంపు కాలనీలకు వరద ఇబ్బందుల నుంచి ఉపశమనం కలిగే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వాస్తవానికి ఆత్మకూరు పట్టణంలో భారీ వర్షాలు కురిసి వరదలు సంభవించిన సందర్భంలో పట్టణంలోని సగ భాగానికి పైగా కాలనీల్లోని వర్షపు నీరంతా గుండ్లకమ్మ వాగు ద్వారే నదుల్లోకి చేరుతోంది. అయితే వాగు ఆక్రమణలకు గురైతే ఆయా కాలనీలకు వరద కష్టాలు తప్పవు. ఆక్రమణలు, పూడిక లేకుండా గుండ్లకమ్మవాగు తీర్చిదిద్దితే వరద ప్రవాహానికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తవు. ఇప్పటికైనా.. సంబంధిత శాఖ అధికారులు స్పందించి ఆత్మకూరు పట్టణానికి వరద కష్టాలు తీర్చేందుకు చొరవ తీసుకోవాలని ముంపు కాలనీల ప్రజలు కోరుతున్నారు.



పట్టణంలో ఆక్రమణలకు గురైన గుండ్లకమ్మవాగు

సీఎం రాకతో ప్రజలకు నరకం

- వాహనాలను ఎక్కడికక్కడే నిలిపేసిన పోలీసులు
- తీవ్ర ఇబ్బందులు పడ్డ ప్రయాణికులు



రహదారికి అడ్డంగా పెట్టిన బైకులు, తోపుడు బండ్లు

బనగానపల్లె, మార్చి 14: బనగానపల్లె పట్టణంలో వంద పడకల ఆస్పత్రి ప్రారంభానికి, ఈబీసీ నేస్తం బటన్ నొక్కడానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రావడంతో గురువారం మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజలు నరకయాతన అనుభవించారు. ద్విచక్ర వాహనదారులు, ఆర్టీసీ ప్రయాణికులు నానా అవస్థలు పడ్డారు. బనగానపల్లె పట్టణంలో పెట్రోల్ బంకు కూడలి వరకు మాత్రమే ద్విచక్రవాహనాలను అనుమతించారు. అక్కడ నుంచి ఇతర గ్రామాలకు వెళ్లడానికి అనుమతించలేదు. అత్యవసర పనులపై ద్విచక్ర వాహనాల్లో, కార్లలో వెళ్లే వాళ్లు సీఎం ప్రోగ్రాం అయ్యే దాకా నరక యాతన అనుభవించారు. ఉదయం 9 గంటలనుంచే పట్టణంలో ట్రాఫిక్ నిబంధనలు విధించడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సీఎం సభకు భారీ జన సమీకరణ చేయాలని స్థానిక అధికారులకు, సిబ్బందికి ఆదేశాలు వెళ్లడంతో వారు నానాయాతన పడి పొదుపు మహిళలను అధికంగా సభకు రప్పించారు. వెలుగు అధికారులు డ్వాక్రా మహిళలను భారీగా తరలించారు. అయితే సభాస్థలం చిన్నది కావడం, సరైన వసతులు లేకపోవడంతో మహిళలు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. ఎండ వేడిమికి, ఉక్కపోతకు తట్టుకోలేక సీఎం ప్రసంగిస్తుండగానే మహిళలు బయటకు వెళ్లిపోయారు. దీంతో మహిళా గ్యాలరీ ఖాళీగా కనిపించింది. సభ పట్టణం మధ్యలో ఏర్పాటు చేయడంతో పోలీసులు తీవ్ర ఆంక్షలు విధించారు. పట్టణంలోనికి వచ్చే ప్రయాణికుల బస్సులను రెండు కిలోమీటర్ల దూరంలోనే నిలిపివేశారు. నంద్యాల నుంచి వచ్చే వాహనాలను మిట్టపల్లె రౌంట్ల, వద్ద, గుత్తి వైపు నుంచి వచ్చే వాహనాలను సాయిబాబా ఆలయం వద్ద, అవుకు, కోవెలకుంట్ల మండలాల నుంచి, అవుకు, కొలిమిగుండ్ల మండలాల నుంచి వచ్చే వాహనాలను, ఆర్టీసీ వాహనాలను కిలో మీటరు దూరంలో నిలిపివేశారు. వారు పట్టణంలోకి రావడానికి ఇబ్బందిపడ్డారు. ఇక మిగతా వాహనాలను పట్టణంలోనికి అనుమతించలేదు. దీంతో బనగానపల్లెకు వచ్చేవారు, ఇక్కడి నుంచి వేరే ఊళ్లకు వెళ్లేవారు నడుచుకుంటూ ఆర్టీసీ బస్టాండుకు వెళ్లి బస్సెక్కాల్సి వచ్చింది. సీఎం సభకు ప్రైవేటు పాఠశాలలకు బలవంతంగా సెలవు ప్రకటించి ఆ పాఠశాలల బస్సులను జనాన్ని తరలించేందుకు ఉపయోగించుకున్నారు. ఆర్టీసీ బస్సులను కూడా వివిధ ప్రాంతాలకు తరలించడంతో బస్సులు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ప్రభుత్వ పాఠశాలలకు కూడా ఆర్టీసీ బస్సులు అందుబాటులో లేకపోవడంతో విద్యార్థులు పాఠశాలలకు వెళ్లలేకపోయారు. దీంతో ఉపాధ్యాయులు మాత్రమే పాఠశాలకు చేరుకున్నారు. పట్టణంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు పూర్తిగా మూసివేశారు. నవాబు విగ్రహాన్ని సీఎం ప్రారంభిస్తారని ప్రజలు అనుకున్నారు. కానీ సీఎం వెళ్లిపోయాక ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి నవాబు విగ్రహాన్ని ఆవిష్కరించారు.





సీఎం ప్రసంగిస్తుండగానే వెళ్లిపోతున్న మహిళలు

నిధుల మళ్లింపుపై సర్పంచుల ఆగ్రహం

- ఏపీలో పంచాయతీ వ్యవస్థ నిర్వీర్యం
- గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలు అనే స్ఫూర్తికి తూట్లు
- రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, వీధి దీపాల పనులు శూన్యం
- వైసీపీ ప్రభుత్వాన్ని ఓడించడమే సర్పంచుల లక్ష్యం
- ఏపీ పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర నాయకులు రాజేంద్ర ప్రసాద్, బిర్రు ప్రతాప్ రెడ్డి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సర్పంచులు

కర్నూలు(కలెక్టరేట్), మార్చి 14: గత మూడు సంవత్సరాలుగా వైసీపీ ప్రభుత్వం రాజ్యాంగబద్ధంగా గ్రామ పంచాయతీలకు ఇవ్వాల్సిన నిధులు, స్థానిక ఆదాయ వనరుల ద్వారా వచ్చే సొంత నిధులు, కేంద్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి ఇచ్చిన 14, 15వ ఆర్థిక సంఘం నిధులను వైసీపీ ప్రభుత్వం దొంగిలించి తన సొంత పథకాల అమలుకు వాడుకుందని సర్పంచులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం సర్పంచులు తమ 16 డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వైవీబీ రాజేంద్రప్రసాద్, బిర్రు ప్రతాప్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం పంచాయితీలకు రావాల్సిన వేల కోట్ల రూపాయలను నిధులను తన అవసరాలకు దారి మళ్లించి మోసం చేసిందని అన్నారు. దీని వల్ల గత మూడు సంవత్సరాలుగా గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీ తాగునీరు, వీధి దీపాలు తదితర అభివృద్ధి పనులు చేయలేక సర్పంచ్‌లు ఉత్సవ విగ్రహాలుగా మిగిలిపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. దీని వల్ల రాష్ట్రంలోని 2,918 గ్రామాల్లో 3.50 కోట్ల మంది గ్రామ ప్రజలు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. మరలా వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రాష్ట్రంలోని గ్రామాలు శిథిలమయ్యే పరిస్థితి వస్తుందన్నారు. దేశంలోని ఆంధ్రప్రదేశ్‌లో పంచాయతీరాజ్ వ్యవస్థ నిర్వీర్యం అయిపోయిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు మునిరెడ్డి, చిత్తూరు జిల్లా పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షుడు ధనుంజయ యాదవ్, సర్పంచుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు లెనిన్, కార్యదర్శి వేణుగోపాల్ రెడ్డి, సహాయ కార్యదర్శి రామచంద్రుడు, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు పాల్గొన్నారు.

సామాన్యుడికి టికెట్

- నందికొట్కూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా గిత్తా జయసూర్య
- పట్టు సాధించుకున్న మాండ్ర శివానందరెడ్డి



నందికొట్కూరు, మార్చి 14: ఓ సామాన్యుడిని నందికొట్కూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించి ఓ నూతన అధ్యాయానికి శ్రీకారం చుట్టారు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు. గురువారం విడుదల చేసిన రెండో జాబితాలో నందికొట్కూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా గిత్తా జయసూర్య పేరును ప్రకటించారు. వ్యవసాయం చేసుకుంటూ టీడీపీకి విధేయుడిగా ఉన్న జయసూర్యకే టికెట్ వరించింది. నందికొట్కూరు ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గం కావడంతో తన అనుచరుడికే టిక్కెట్ తెప్పించుకుని తన పంథాన్ని నెగ్గించుకున్నారు నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇంచార్జి మాండ్ర శివానందరెడ్డి. 2014 నుంచి టీడీపీలో వివిధ పదవులను అలంకరిస్తూ పార్టీ కార్యక్రమాల్లో గిత్తా జయసూర్య పాల్గొంటూ తనదైన శైలిలో గుర్తింపు తెచ్చుకున్నారు. తాలుకా ఎస్సీసెల్ నాయకుడిగా మొదలైన ఆయన ప్రస్థానం రాష్ట్ర ఎస్సీసెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీగాను నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎదిగారు. జయసూర్యకు టికెట్ కేటాయిస్తూ టీడీపీ అధిష్ఠానం ప్రకటన చేయడంతో నియోజకవర్గ వ్యాప్తంగా ఆ పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకున్నాయి.



అల్లూరు గ్రామంలో జయసూర్య నివాసం ఉంటున్న ఇల్లు

చంద్రబాబుకు కానుకగా ఇస్తాం

టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇంచార్జి మాండ్ర శివానందరెడ్డి ఆధ్వర్యంలో ఈసారి నందికొట్కూరులో టీడీపీ గెలుపు తథ్యం. గత 20 ఏళ్ల నుంచి నందికొట్కూరులో టీడీపీ జెండా ఎగురలేదు. ఈ సారి టీడీపీని గెలిపించి విజయాన్ని అధినేత చంద్రబాబు నాయుడుకు బహుమతిగా ఇస్తాం. తనకు టిక్కెట్ రావడంలో ఎంతో కృషి చేసిన మాండ్ర శివానందరెడ్డి, ఆయన సతీమణి ఉమాదేవిలకు కృతజ్ఞతలు.


- గిత్తా జయసూర్య, నందికొట్కూరు నియోజకవర్గ అభ్యర్థి

నందికొట్కూరులో లోకల్ వర్సెస్ నాన్ లోకల్

కడపకు చెందిన వైసీపీ అభ్యర్థిగా ధారా సుధీర్ బరిలో ఉన్నారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా జయసూర్యను ప్రకటించడంతో లోకల్ వర్సెస్ నాల్‌లోకల్‌గా ఈ ఎన్నికలు జరగనున్నాయి. ఇప్పటికే నియోజకవర్గంలో నాన్‌లోకల్ వ్యక్తికి ప్రజలు ఏవిధంగా ఓటు వేస్తారని వైసీపీ నాయకుల్లోనే అంతర్మథనం మొదలైంది. జయసూర్య స్థానికుడు కావడం ఆయనకు కలిసొచ్చే అంశం. ముఖ్యంగా మాండ్ర శివానందరెడ్డికి ముఖ్య అనుచరుల్లో ఒకరుగా ఆయనకు నియోజకవర్గ వ్యాప్తంగా పేరుంది. లోకల్ వర్సెస్ నాన్ లోకల్‌గా ఈ సారి జరిగే ఎన్నిక ఉండబోతుందని రాజకీయ విశ్లేషకులు చర్చించుకుంటున్నారు.

గిత్తా జయసూర్య ప్రొఫైల్

పేరు: గిత్తా జయసూర్య
విద్యార్హత: డిగ్రీ
జన్మస్థలం: అల్లూరు గ్రామం, నందికొట్కూరు మండలం.
జన్మించిన తేదీ: 26-01-1982
కులం: మాదిగ
మాతృభాష: తెలుగు
తల్లిపేరు: సులోచనమ్మ తండ్రి: గాంధీ
భార్య: బి.సరస్వతమ్మ
సంతానం: ఇద్దరు కుమారులు



న్యాయం కావాలి

- పోలీసు స్టేషన్ ఎదుట పిల్లలతో మహిళ మౌనపోరాటం
- మద్దతు తెలిపిన ప్రజా సంఘాలు



ప్యాపిలి పోలీసు సర్కిల్ కార్యాలయం ఎదుట పిల్లలతో కూర్చున్న బాధితురాలు లిల్లి

ప్యాపిలి, మార్చి 14: భర్త మీద చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని కోరుతూ ఓ మహిళ గురువారం పట్టణంలోని పోలీసు సర్కిల్ కార్యాలయం ఎదుట తన ఇద్దరి పిల్లలతో మౌన పోరాటానికి దిగింది. కడప జిల్లా జమ్మలమడుగుకు చెందిన పండిత లిల్లికి, ప్యాపిలి మండలంలోని ఎస్ రంగాపురం గ్రామానికి చెందిన పవన్‌కు ఫోన్ ద్వారా కలిగిన పరిచయం ప్రేమగా మారింది. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న పవన్ తరచూ జమ్మలమడుగుకు వెళ్లి లిల్లిని కలిసేవాడు. వీరి పెళ్లిని పెద్దలు అంగీకరించలేదు. దీంతో వీరు 2017లో జమ్మలమడుగులో వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు కూతుళ్లు. అయితే గత ఏడాది పవన్ తనకు ఇష్టలేదని భార్యను వదిలేశారు. భర్త కుటుంబ సభ్యులను కలిసి న్యాయం చేయాలని కోరినా వారు పట్టించుకోలేదు. దీంతో మహిళ ప్యాపిలి పోలీసు స్టేషన్ ఎదుట న్యాయం కోసం ఇద్దరు పిల్లలతో కలసి మౌన పోరాటానికి దిగింది. తనకు న్యాయం జరగపోతే ఇక్కడే ఆత్మహత్యనే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేసింది. ఈ మెకు ఎమ్మార్పీఎస్, సీపీఐ నాయకులు, మహిళా మండలి సభ్యులు మద్దతు తెలిపారు. న్యాయం జరిగే వరకు వెంట ఉంటామని మహిళ తన పోరాటాన్ని తాత్కాలికంగా విరమింపజేశారు. సీఐ సుధాకర్‌రెడ్డిని వివరణ కోరగా.. బాధితురాలు లిల్లి ఫిర్యాదు మేరకు పవన్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నిందితుడి కోసం గాలిస్తున్నామని అన్నారు.

18 నుంచి ఒంటిపూట బడులు

నంద్యాల (నూనెపల్లె), మార్చి 14: రాష్ట్రంలో ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ఆదేశాల మేరకు ఈనెల 18వ తేదీ నుంచి జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్య పాఠశాలలకు ఒంటిపూట బడులు నిర్వహిస్తున్నట్లు డీఈవో సుధాకర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7.45 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పాఠశాలలను నిర్వహించాలని సూచించారు. ఏప్రిల్ నెల రెండో శనివారం పాఠశాలలు నిర్వహించాలని చెప్పారు. పాఠశాలల ఆరుబయట, చెట్ల కింద తరగతులు నిర్వహించవద్దని ఆదేశించారు. పదో తరగతి పరీక్షాలు జరిగే కేంద్రాల హెచ్‌ఎంలు ఆ 7 రోజులలో పాఠశాలల్లో తరగతులను నిర్వహించకూడదని అన్నారు. ఈ ఏడు రోజులకు బదులు మార్చి 24, 31, ఏప్రిల్ 7, 13, 14, 21 తేదీల్లో తరగతులను నిర్వహించుకోవాలని ఆదేశించారు.

వైసీపీకి షాక్

- టీడీపీలో చేరిన కర్నూలు ఎంపీ సంజీవకుమార్
- పసుపు కండువా వేసి ఆహ్వానించిన చంద్రబాబు



ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్‌ను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న చంద్రబాబు

కర్నూలు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల షెడ్యూలు రాబోతున్న కీలక తరుణంలో వైసీపీకి భారీగా రాజకీయ దెబ్బలు తగులుతున్నాయి. ఇటీవలే జిల్లాకు చెందిన మంత్రి గుమ్మనూరు జయరాం వైసీపీ పార్టీకి, మంత్రి పదవికి రాజీనామా చేసి చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ ఘటన నుంచి వైసీపీలో తేరుకోకనే మరో భారీ షాక్ ఇచ్చారు కర్నూలు ఎంపీ డాక్టరు సంజీవ్‌కుమార్ గురువారం మంగళగిరి టీడీపీ జాతీయ కార్యాలయంలో ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ సీఎం చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. పసుపు కండువా వేసి చంద్రబాబు పార్టీలోకి ఆహ్వానించారు. నగరంలో ప్రముఖ ప్రైవేటు వైద్యశాల అయుష్మాన్‌భవ ఆస్పత్రి అధినేత అయిన డాక్టర్ సంజీవ కుమార్ 2019 ఎన్నికలకు ముందు రాజకీయాల్లోకి అడుగు పెట్టారు. బీసీలలో చేనేత సామాజిక వర్గానికి చెందిన ఈయనకు వైసీపీ టికెట్‌పై పోటీ చేసి ఎంపీగా గెలిచారు. రాబోయే ఎన్నికల్లో కూడా కర్నూలు ఎంపీ టికెట్ ఆశించారు. అయితే.. ఆయనకు మాట మాత్రంగానైన చెప్పకుండా సీఎం జగన్ మరో అభ్యర్థికి అవకాశం ఇవ్వడంతో అవమానంగా భావించిన ఆయన జనవరి 10న వైసీపీ సభ్యత్వానికి, ఎంపీ పదవికి రాజీనామా చేశారు. ఆ రోజు నుంచి సైలెంట్‌గా ఉన్న ఆయన గురు వారం తన అనుచరులు, సన్నిహితులతో కలసి మంగళగిరి చేరుకున్నారు. టీడీపీ అధినేత చంద్రబాబును కలిసి టీడీపీలో చేరారు. ప్రస్తుతం కర్నూలు టీడీపీ ఎంపీ టికెట్ ఆశిస్తున్నారు. కర్నూలు, ఎమ్మిగనూరు, ఆదోని, కోడుమూరులో చేనేత వర్గాల్లో డాక్టర్ సంజీవ్‌కుమార్‌కు మంచి పట్టు ఉంది. ఆయన చేరిక చేనేతల్లో టీడీపీకి కలసి వస్తుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు పూర్తి

వీడ్కోలు చెప్పుకున్న విద్యార్థులు



పరీక్ష రాసి వెళ్తున్న విద్యార్థినులు

కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 14: ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం మెయిన్ పరీక్షలు గురువారం పూర్తయ్యాయి. ఈ నెల 1వ తేదీన ఈ పరీక్షలు ప్రారంభమయ్యాయి. అయితే.. మైనర్ మీడియా పరీక్షలు ఈ నెల 20వ తేదీ వరకు కొనసాగుతాయి. ఇంటర్ ద్వితీయ సంవత్సరం మెయిన్ పరీక్షలు శుక్రవారంతో పూర్తి కానున్నాయి. పరీక్ష కేంద్రాల నుంచి బయటికి వచ్చిన విద్యార్థులు ఆనందంతో గంతులేస్తూ కేరింతలు కొట్టారు. బై.బై అంటూ ఒకరికొకరు వీడ్కోలు చెప్పుకున్నారు. పరీక్షలు పూర్తి కావడంతో హాస్టల్‌లో ఉండే విద్యార్థులు తమ సరంజామాను సర్దుకుని సొంతూళ్లకు బయలుదేరి వెళ్లారు.

820 మంది విద్యార్థులు గైర్హాజరు

జిల్లాలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం గురువారం జరిగిన పరీక్షకు 820 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఆర్ఐవో ఎస్‌వీఎస్ గురువయ్యశెట్టి తెలిపారు. జిల్లాలో మొదటి సంవత్సరం విద్యార్థులు మొత్తం 23,418 మంది నమోదు చేసుకున్నారని అన్నారు. వీరిలో 820 మంది పరీక్షలకు గైర్హాజరయ్యారని తెలిపారు. మాల్ ప్రాక్టీసు కేసులు నమోదు కాలేదన్నారు.

పదోన్నతిపై డైట్ ప్రిన్సిపాల్ నియామకం

కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 14: కర్నూలు డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్న సీనియర్ లెక్చరర్ పి.వసుంధరాదేవికి పదోన్నతి కల్పిస్తూ డైట్ ప్రిన్సిపాల్‌గా నియమించారు. ఈ మేరకు పాఠశాల విద్యా శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. గురువారం వసుంధర దేవి ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెకు టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది అభినందనలు తెలిపారు.

పేరుసోముల ఉపాధ్యాయుడికి మోదీ ప్రశంస

సంజామల, మార్చి 14: సంజామల వాని పేరుసోముల జిల్లా పరిషత్ సైన్స్ ఉపాధ్యాయుడు మేడా హరిప్రసాద్‌ను అభినందిస్తూ భారత ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసా పత్రాన్ని గురువారం పంపించారు. ఈ ఏడాది జనవరి 29 న జరిగిన పరీక్షపై చర్చ ఆన్‌లైన్ కార్యక్రమంలో పాల్గొని 10వ తరగతి విద్యార్థులకు పరీక్షల పట్ల గల వివిధ సందేహాలు ప్రస్తావించి వాటిని నివృత్తి చేసి మానసికంగా ఒత్తిడి ఎదుర్కొని పరీక్షలు ఎలా రాయాలి తదితర అంశాలపై చర్చించినందుకు ప్రధానమంత్రి కార్యాలయం నుండి ప్రశంస పత్రం పాఠశాల వె బ్‌సైట్‌కు పంపారు. ఈ పాఠశాలలో హెచ్‌ఎం. సీతరావమ్మ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు హరిప్రసాద్‌ను అభినందించారు.

మహానంది క్షేత్ర పండితులకు అవార్డులు



మహానంది పండితుడు రవిశంకర్ అవధానికి అవార్డు ప్రధానం చేస్తున్న పీఠాధిపతి

మంత్రాలయం, మార్చి 14: మంత్రాలయం రాఘవేంద్రస్వామి గురు వైభవోత్సవాల్లో నాల్గవ రోజు గురువారం రాత్రి మహానంది పుణ్యక్షేత్రంలోని పండితులకు పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు అవార్డులు ప్రదానం చేశారు. నంద్యాల జిల్లా మహానంది పుణ్యక్షేత్రం విద్వాన్ రవిశంకర్ అవధానికి, వేద పండితులకు, అదే పుణ్యక్షేత్రం విద్వాన్ వెంకటదుర్గ నాగేశ్వరశర్మ వేద పండితులకు పీఠాధిపతి నగదు, అవార్డు, ప్రశంసాపత్రం, వెండిగిన్నె, మెమెంటో, ఫలపుష్ప మంత్రాక్షితలు ఇచ్చి సత్కరించారు.

యువకుడి ఆత్మహత్య

కర్నూలు, మార్చి 14: మూడో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారపేటకు చెందిన ఉమామహేశ్వరరెడ్డి (26) అనే యువకుడు ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన గురువారం జరిగింది. ఉమామహేశ్వరరెడ్డి కారు డ్రైవర్‌గా పని చేస్తూ ప్రమాదానికి గురి కావడంతో ఇంట్లోనే ఉంటున్నాడు. తాగుడుకు బానిసై జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురికి తరలించారు. తల్లి శ్రీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అడుగంటుతున్న జలాశయాలు

- ఎండుతున్న పైర్లు
- గొంతెండుతున్న జనాలు



ఎండిపోయిన తుంగభద్ర నది పరివాహక ప్రాంతం

కర్నూలు(అగ్రికల్చర్), మార్చి 14: గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రధాన నదులైన కృష్ణా, తుంగభద్ర నదుల పరివాహక ప్రాంతం ఎడారిగా కనిపిస్తున్నది. నదుల మీద ఆధారపడి రైతులు తవ్వుకున్న బోరుబావుల్లో చుక్కనీరు లేక ప్రస్తుత రబీ పంటలు కళ్లెదుటే ఎండిపోతున్నాయి. అంతేగాక జూన్, జూలై నెలల వరకు ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ముందు చూపుతో నీటిని నిల్వ చేసిన జలాశయాలు అడుగంటుతున్నాయి. తుంగభద్ర జలాశయంలో 1,633 అడుగుల నీటి మట్టం వద్ద 105.788 టీఎంసీల నీరు పూర్తినిల్వ సామర్థ్యంగా ఉంది. అయితే.. తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా ఈ జలాశయానికి ఏ సీజన్‌లో కూడా పూర్తి స్థాయి నీటి నిల్వ చేరలేదు. మరింత దారుణంగా ప్రస్తుతం ఈ జలాశయంలో 1,583.65 నీటి మట్టం వద్ద కేవలం 6.47 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. అదే విధంగా శ్రీశైలం జలాశయంలో పూర్తి స్థాయి నీటి మట్టం 845 అడుగుల వద్ద 215 టీఎంసీల నీరు నిల్వ చేస్తున్నారు. ప్రస్తుతం ఈ జలాశయంలో నీటి నిల్వలు డెడ్ స్టోరేజీకి చేరాయి. ఏపీతో పాటు తెలంగాణ, ప్రకాశం జిల్లాలకు సాగు, తాగునీరు అందించేందుకు ఏ మాత్రం అవకాశం లేకుండా పోయింది. ప్రస్తుతం ఈ జలాశయంలో కేవలం 811.60 అడుగుల వద్ద కేవలం 75.22 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. డోన్, కర్నూలు, ఎమ్మిగనూరు, కోడుమూరు, పత్తికొండ నియోజకవర్గాల్లో సాగు, తాగునీటికి ప్రధాన నీటి వనరుగా ఉన్న గాజులదిన్నె ప్రాజెక్టులో 4.5 టీఎంసీల నీటి నిల్వకు గాను ప్రస్తుతం 1.695 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. కర్నూలు నగరానికి తాగునీటిని అందించే సుంకేసుల జలాశయం పూర్తి స్థాయి నీటి నిల్వ 1.2 టీఎంసీలు కాగా, కేవలం 0.089 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. హంద్రీనీవా కాలువ ద్వారా నీటిని నింపుతున్న క్రిష్ణగిరి రిజర్వాయరులో ఉన్న 0.164 టీఎంసీల నీరు జూన్ వరకు తాగునీటి అవసరాలు తీర్చాల్సి ఉంది. అందువల్ల ఈ నీటిని ఇతర అవసరాలకు మళ్లించకుండా జాగ్రత్తగా కాపాడుతున్నారు. వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయరులో 16.95 టీఎంసీల నీటికి గాను గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ జలాశయంలో ప్రస్తుతం 1.478 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. ఈ జలాశయం నీటినే నంద్యాల తాగునీటి అవసరాలకు వినియోగిస్తున్నారు. గోరుకల్లు రిజర్వాయరులో 12.5 టీఎంసీల నీటి నిల్వకు గాను కేవలం 2.5 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. అవుకు రిజర్వాయరులో 4.148 టీఎంసీల నీటి నిల్వ ఉండాలి. కానీ ప్రస్తుతం 0.894 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. పందికోన రిజర్వాయరులో 1.126 టీఎంసీలకు గాను కేవలం 0.50టీఎంసీల నీరు మాత్రమే ఉంది. పులికనుమలో 1.243 టీఎంసీల నీటి నిల్వకు గాను కేవలం 0.23 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. త్వరితగతిన అడుగంటుతున్న జలాశయాల్లో నీటి నిల్వలను చూసి నీటి పారుదల శాఖ అధికారులు జూలై వరకు ఈ కొద్దిపాటి నీటితో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఎలా సర్దుబాటు చేయాలని మధనపడుతున్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయం: సీఎం

- ఈబీసీ నేస్తం నిధుల విడుదలకు బటన్ నొక్కిన జగన్
- వర్చువల్‌గా వంద పడకల ఆస్పత్రి ప్రారంభం



ఈబీసీ నేస్తం చెక్‌ను పంపిణీ చేస్తున్న సీఎం జగన్

బనగానపల్లె, మార్చి 14: పేదల సంక్షేమమే తన ధ్యేయమని ఏపీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం బనగానపల్లె పట్టణంలోని ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆధ్వర్యంలో ఈబీసీ నేస్తం నిధులకు సబంధించి బటన్ నొక్కారు. మూడో విడత నిధులు విడుదల చేసేందుకు బనగానపల్లెకు ఉద యం 11.30 గంటలకు ఉన్నత పాఠశాల మైదానానికి చేరుకు న్నారు. ఓర్వకల్లు విమానాశ్రమం నుంచి కర్నూలు రహదారిలోని అయ్యప్ప స్వామి ఆలయం ఎదురుగా ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకు న్నారు. సీఎంకు మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల వెంకటరెడ్డి, ఎంపీ పోచా బ్రహ్మానందారెడ్డి తదితరులు స్వాగతం పలికారు. అక్కడ నుంచి కాన్వాయ్‌లో ఉన్నత పాఠశాల మైదానంలోని ప్రాంగణానికి సీఎం చేరుకున్నారు. సభా ప్రాంగణానికి చేరుకున్న తర్వాత బనగానపల్లె పట్టణంలో రూ.22 కోట్ల వ్యయంతో నిర్మించిన వంద పడకల ప్రాంతీయ ప్రభుత్వ వైద్యశాలను సభా ప్రాంగణం నుంచే వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో సీఎం జగన్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్ ఈబీసీ నేస్తం ద్వారా 45 నుంచి 60 ఏళ్ల వయస్సుగల ఓబీసీ వర్గాలు 4,19, 583 మందికి రూ.629 కోట్ల ఆర్థిక సాయం అందించినట్లు తెలిపారు. ప్రతి ఏటా రూ.15,000 చొప్పున మూడేళ్లుగా రూ.45వేలు అందించామన్నారు. మహిళలు వారి కాళ్లమీద వారు నిలబడేలా చేశామన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీలు ఒక కూటమిగా ఏర్పాటై మీదగ్గరకు వస్తున్నారని జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈ పార్టీలు గెలిస్తే సంక్షేమ పథకాలు అందవన్నారు. చంద్రబాబు నాయుడు గతంలో ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన వాటిని అమలు చేయలేదన్నారు. పవన్ కళ్యాణ్ పెళ్లిళ్లపై మరోసారి సీఎం జగన్ నోరు పారేసుకున్నారు. ఆంధ్రజ్యోతి, ఈనాడు, పత్రికలు చదవ వద్దని, ఏబీఎన్, ఈటీవీ, టీవీ-5 చానెళ్లను చూడవద్దని చెప్పారు. కార్యక్రమంలో ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథరెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, రాష్ట్ర నీటి పారుదలశాఖ సలహాదారుడు గంగుల ప్రభాకరరెడ్డి, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందారెడ్డి, నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, ఏపీ ఇరిగేషన్ శాఖ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కర్రా గిరిజ, రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ రాజీనామా చేయాలి : టీడీపీ



ధర్నా చేస్తున్న గౌరు చరిత, మల్లెల రాజశేఖర్, నాయకులు

ఓర్వకల్లు, మార్చి 14: ఏపీపీఎస్‌సీలో జరిగిన అక్రమాలపై తక్షణమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి రాజీనామా చేయాలని టీడీపీ పాణ్యం ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత, నంద్యాల టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ డిమాండ్ చేశారు. ఈ అక్రమాలను నిరసిస్తూ గురువారం మండలంలోని జాతీయ రహదారిపై రాస్తారోకో ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా గౌరు చరిత, రాజశేఖర్ మాట్లాడుతూ ఏపీపీఎస్‌సీలో రూ.150 కోట్ల కుంభకోణం జరిగిందన్నారు. సంతలో పశువులను అమ్ముకున్నట్లు జగన్ రెడ్డి ఏపీపీఎస్‌సీలో ఉద్యోగాలను అమ్ముకున్నారన్నారు. గ్రూప్-1 మెయిన్స్‌లో ప్రభుత్వ అక్రమాలు హైకోర్టులో బహిర్గం చేసిందని, ఒక్కో డిప్యూటీ కలెక్టర్ పోస్టుకు రూ.2.50 కోట్లు, ఒక్కో డీఎస్పీ పోస్టుకు రూ.1.50 కోట్లు వసూలు చేశారని ఆరోపించారు. ఏపీపీఎస్ కార్యదర్శి ఆంజనేయులు, చైర్మన్ గౌతమ్ సవాంగ్‌లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏ మాత్రం నైతిక విలువలున్న జగన్ రెడ్డి తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోవిందరెడ్డి, చదువుల సుధాకర్ రెడ్డి, బ్రాహ్మణపల్లి నాగిరెడ్డి, వెంకటరమణ, వెంకటసుబ్బయ్య, భాస్కర్‌రెడ్డి, కేవీ మధు, వేణు, బజారు, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దేహమే దేవాలయం.. జీవుడే దేవుడు

త్రిదండి శ్రీమన్నారాయణ చిన్న జీయర్ స్వామీజీ



గోదా గోకులంలో భక్తులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న త్రిదండి శ్రీమన్నారాయణ చిన్న జీయర్ స్వామీజీ

కర్నూలు(కల్చరల్), మార్చి 14: దేహమే దేవాలయమని, జీవుడే దేవుడని త్రిదండి శ్రీమన్నారాయణ చిన్న జీయర్ స్వామీజీ భక్తులకు ఉద్బోధించారు. కర్నూలు నగర శివారులో, మామిదాల పాడులోగల గోదా రంగనాథస్వామి దేవస్థానంలో కొనసాగుతున్న ఆలయ ప్రథమ వార్షిక బ్రహ్మోత్సవాలకు ముఖ్య అతిథిగా చిన్న జీయర్ స్వామి విచ్చేశారు. ఉత్సవాల్లో మూడో రోజు గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జీవారాధనే దైవారాధన అన్నారు. బుద్ధి భ గవంతునిపై నిలపడమే ఉత్తమ మానవ ధర్మమని అన్నారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లను సూర్యప్రభ వాహన సేవ చేశారు. ఈ కార్యక్రమంలో పీఠాధిపతులు అష్టాక్షరీ సంపత్కుమార రామానుజ జీయర్ స్వామీజీ, అష్టాక్షరీ బృందావన రామానుజ జీయర్ స్వామీజీ, ప్రయాగ్ రాజ్ రాఘవ ప్రపన్న జీయర్ స్వామీజీ, గోదాగోకులం వ్యవస్థాపక అధ్యక్షుడు మారం నాగరాజ గుప్త తదితరులు పాల్గొన్నారు.

రమణీయం.... రథోత్సవం



గూళ్యంలో జోడు రథోత్సవం

హాలహర్వి, మార్చి 14: ఆంధ్ర, కర్ణాటక రెండు రాష్ట్రాల ఇలవేల్పు గాదిలింగేశ్వర, సిద్దేశ్వరస్వాముల జోడు రథోత్సవం నేత్రానందంగా జరిగింది. గురువారం ఉదయం నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు దేవాదాయశాఖ కార్యదర్శి రాధాకృష్ణ రెడ్డి రఘునందన గౌడు, కరుణం రాఘవేంద్రరావు రథచక్రాలకు పూజలు నిర్వహించారు. వేదపండితులు మంత్రాలు వల్లిస్తుండగా గాదిలింగేశ్వరస్వామినామస్మరణంతో మారు మోగింది. ప్రధాన వీధుల్లో దాదాపు రెండు లక్షల పైగా జనం రథాలను లాగారు. జోడురథాలు ఒకేసారి కదిలి రావడంతో వీనులవిందుగా మారింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు బజారప్ప, మోక షైలరప్ప, కురువ మల్లన్న, గాదిలింగప్ప, మారెప్ప పాల్గొన్నారు

సైకో పాలనకు చరమగీతం పాడండి

- టీడీపీ సూపర్ సిక్స్ పథకాలతో ప్రజల జీవితాల్లో వెలుగు
- డోన్ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి



బేతంచెర్ల: ప్రచారంలో కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి

బేతంచెర్ల, మార్చి 14: రాష్ట్రంలో సైకో పాలనకు చరమగీతంపాడి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకోవాలని డోన్ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. గురువారం టీడీపీ మండల కార్యదర్శి షేక్షావలి చౌదరి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమానికి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డితో పాటు రాష్ట్ర కార్యదర్శి వై.నాగేశ్వరరావు యాదవ్, మండల కన్వీనర్ ఎల్ల నాగయ్య, పట్టణ అధ్యక్షురాలు బుగ్గన ప్రసన్నలక్ష్మి, జాకీరుల్లా బేగ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కోట్ల మాట్లాడుతూ డోన్ నియోజకవర్గంలో టీడీపీ జెండాను ఎగురవేయాలని అన్నారు. జగన్ రెడ్డి రాష్ట్రంలో ఉన్న సహజ వనరులన్నీ కొల్లగొట్టారని, వనరులను రాష్ట్ర ప్రయోజనాలకు ఉపయోగించుకోకుండా తన సొంత ప్రయోజనాలను అక్రమ మార్గంలో దోచుకున్నారని అన్నారు. సంపదను సృష్టించలేని జగన్.. రాష్ట్రంలో ఉన్న సహజ వనరులను తన బినామి కంపెనీలకు మళ్లించారని ఆరోపించారు. మరోసారి వైసీపీ అధికారంలోకి వస్తే రాష్ట్రం దివాలా తీయడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో పోలూరు వెంకటేశ్వరరెడ్డి, పోలూరు రాఘవరెడ్డి, భీమేష్ రెడ్డి, ఉస్నం సుధాకర్, కాకర్ల తిరుమలేష్ చౌదరి, బుగ్గన ఆనంద్ రెడ్డి, కేపీ భూపాల్ రెడ్డి, రవీంద్ర నాయక్, రూబెన్, రేగటి భీమారెడ్డి, జావాజీ వెంకటేశ్వర్లు, ముళ్ల, రామాంజనేయులు, టైలర్ రాముడు, ఫయాజ్, గుడివాడ క్రిష్ణమూర్తి, ఎంఎస్ మధులోకేశ్వరెడ్డి, కేవీ సుబ్బారెడ్డి, చంద్ర, సిమెంటునగర్ రాముడు, గూటంశివ, బుక్కాపురం లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

- దైవదర్శనానికి వెళ్లి తిరిగి వస్తుండగా ఘటన
- లారీ కింద పడిన బెంగళూరు వాసి

తుగ్గలి, మార్చి 14: బెంగళూరు చెందిన కార్తీక్, రాఘవేంద్ర ద్విచక్ర వాహనంపై మంత్రాలయం రాఘవేంద్రస్వామి దర్శనానికి వచ్చి తిరిగి వెళుతుండగా వీరి బైక్ అదుపు తప్పి లారీ కింద పడి కార్తిక్ (31) అక్కడిక్కడే మృతి చెందాడు. ఈ ఘటన జొన్నగిరి సమీపంలో గురువారం జరిగింది. కర్ణాటక రాష్ట్రం దక్షిణ బెంగుళూరు చెందిన ఆదిశేషయ్య కుమారుడు కార్తీక్ (31) రాఘవేంద్ర అనే వ్యక్తితోపాటు మంత్రాలయం వెళ్లి తిరిగి వస్తుండగా.. జొన్నగిరి వద్ద వీరి బైక్ అదుపు తప్పి ఎదురుగా వస్తున్న వాహనాలను తప్పించబోయి ఎగిరి లారీ కింద పడటంతో కార్తీక్ తలపై లారీ వెళ్లింది. దీంతో కార్తీక్ అక్కడికక్కడే మృతి చెందాడు. రాఘవేంద్రకు స్వల్పగాయాలయ్యాయి. జొన్నగిరి పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పత్తికొండ వైద్యశాలకు తరలించారు. వారి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ రంగస్వామి తెలిపారు.

నిర్బంధ సమావేశం



సమావేశం జరిగిన పార్క్‌కు వేసిన తాళం

నందికొట్కూరు, మార్చి 14: నందికొట్కూరు మెప్మా అధికారులు సమావేశానికి పిలిపించి బయటకు వెళ్లకుండా నిర్బంధించారు. గురువారం నందికొట్కూరు పట్టణంలోని జై కిసాన్ పార్కులో వైఎస్ఆర్ చేయూత 4వ విడత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సమావేశం మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, కమిషనర్ సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన వారు ఉక్కపోతకు తట్టుకోలేక బయటకు వెళ్లేందుకు ప్రయత్నించగా పార్కు ప్రధాన గేటును మూసి వేసి, పొదుపు సంఘాల మహిళలను కాపలా ఉంచారు. దీంతో అటు బయటకు వెళ్లలేక, సమావేశంలో కూర్చోలేక మహిళలు ఇబ్బందిపడ్డారు. ఇలాంటి సమావేశాలకు మరోసారి హాజరు కాకూడదని మహిళలు అనుకుంటూ వెళ్లిపోయారు.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

అధినేత చంద్రబాబుకు మాండ్ర కృతజ్ఞతలు



టీడీపీ నాయకులతో మాండ్ర శివానందరెడ్డి

నందికొట్కూరు, మార్చి 14: నందికొట్కూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా గిత్తా జయసూర్యను ప్రకటించడంతో నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి టీడీపీ అధినేత చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. గురువారం రాత్రి అల్లూరు గ్రామంలో మాండ్ర శివానందరెడ్డి ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎన్నికైన గిత్తా జయసూర్యకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌కు, రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. వీరంప్రసాద్‌రెడ్డి, సురేంద్రనాథ్ రెడ్డి, రఘునాథ్‌రెడ్డి, జనార్దన్ నాయుడు తదితరులు ఉన్నారు.

టీడీపీ అభ్యర్థి జయసూర్య పూజలు



రంగనాథ స్వామికి పూజలు చేస్తున్న జయసూర్య, తదితరులు

జూపాడుబంగ్లా, మార్చి 14: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ తరుపున నందికొట్కూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేయడానికి రాష్ట్ర ఎస్సీసెల్ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పని చేస్తున్న గిత్తజయసూర్యను గురువారం పార్టీ అధిష్ఠానం పేరును ప్రకటించింది. దీంతో సాయంత్రం గిత్త జయసూర్యతో పాటు టీడీపీ మండల నాయకులు తర్తూరు గ్రామంలోని రంగనాథస్వామిని దర్శించుకున్నారు. పురోహితులు ఆలయ మర్యాదలతో సత్కరించారు. టీడీపీ నాయకులు మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, గుండ్రెడ్డి మోహన్‌రెడ్డి, గిరీశ్వరరెడ్డి, వెంకటేశ్వర్లు యాదవ్, రమణారెడ్డి, పిక్కిలి శ్రీనివాసులు, రవికుమార్‌యాదవ్, రవికాంత్, వేణుగోపాల్‌రెడ్డి, మద్దూరు సుధాకర్, జంగాలపెద్దన్న, బాబు తదితరులు పాల్గొన్నారు.

జయసూర్య అభ్యర్థి ప్రకటనపై హర్షం

నందికొట్కూరు: టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా గిత్తా జయసూర్యను ప్రకటించడం అభినందనీయమని టీడీపీ ముస్లిం మైనార్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి షకీల్ అహ్మద్ అన్నారు. గురువారం పట్టణంలో విలేకరుల సమావేశం నిర్వహించి శుభాకాంక్షలు తెలిపారు. ముస్లిం మైనార్టీ నాయకులు రసూల్‌ఖాన్, హమీద్‌మియా, సయ్యద్ అహ్మద్, రహమతుల్లా, 12వ వార్డు ఇన్‌చార్జి శాంతిరాజు, తదితరులు పాల్గొన్నారు.

పాములపాడులో సంబరాలు

పాములపాడు: టీడీపీ నందికొట్కూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా గిత్తా జయసూర్యను ప్రకటించడంతో పాములపాడులో బాణసంచా కాల్చి, స్వీట్లు పంచి సంబరాలు చేసుకున్నారు. అలాగే ర్యాలీ నిర్వహించారు. నాయకులు తిమ్మారెడ్డి, రవీంద్రరెడ్డి, చంద్రశేఖర్, జనసేన నాయకులు పాల్గొన్నారు. ఇస్కాల గ్రామంలో నాగలక్ష్మిరెడ్డి, కలిముల్లా, లింగస్వామి బాణసంచా కాల్చి సంబరాలు చేసుకొన్నారు.

'శంఖారావం' కిట్ల పంపిణీ



శంఖారావం కిట్లు పంపిణీ చేస్తున్న ఫరూక్

నంద్యాల రూరల్, మార్చి 14: మండలంలోని పాండురంగాపురం గ్రామంలో గురువారం టీడీపీ నంద్యాల నియోజకవర్గ అభ్యర్థి ఎన్ఎండీ ఫరూక్ గురువారం శంఖరావం కిట్లను పంపిణీ చేశారు. అనంతరం ఆయన టీడీపీ గ్రామ నాయకులతో సమావేశం నిర్వహించారు. బీసీ డిక్లరేషన్‌ను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లటంతోపాటు సూపర్ సిక్స్ పథకాలు ఇంటింటికి చేర్చాలని గ్రామ నాయకులకు సూచించారు. పార్టీ మండల అధ్యక్షుడు విశ్వనాథ రెడ్డి, మునగాల మాజీ సర్పంచ్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవగాహన సదస్సు

పాణ్యం, మార్చి 14: మండలంలోని శాంతిరాం ఫార్మసీ కళాశాలలో గురువారం 'పవర్ ఆఫ్ మెటా మేటకాగ్నిషన్ ఇన్ డైలీ లైఫ్' అనే అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. హైదరాబాద్ మైండ్ యువర్ ఫాంటమ్స్ సంస్థ సీఈవో జైచంద్రరాజు మాట్లాడుతూ వ్యక్తి తన ఆలోచనల గురించి ఆలోచించడమే మేటకాగ్నిషన్ (స్వబుద్ధి) అన్నారు. స్వబుద్ధితో చేసే ఏపనైనావిఫమవుతుందని అన్నారు. విద్యార్థులు మేటకాగ్ని షన్ ఉపయోగించుకోవడం వలన పాఠ్యాంశాలను అవగాహన చేసుకొని తద్వారా జ్ఞానాన్ని నిర్మించుకోగలరన్నారు. అలాగే స్వీయ ప్రశ్నలను అడ గడం నేర్చుకుంటారన్నారు. విద్యార్థులు పాజిటివ్‌గా ఆలోచిం చడం ద్వారా తమ జ్ఞానాన్ని పెంచుకోగలరన్నారు. ప్రిన్సి పాల్ డాక్టర్ మధుసూదన్‌చెట్టి, కోఆర్డినేటర్ డాక్టర్ దస్తగిరిరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభ

పాణ్యం, మార్చి 14: మండలంలోని శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు సాంకేతిక సదస్సులో అత్యంత ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం తెలిపారు. గురువారం ఆయ మాట్లాడుతూ ఈనెల 13 వతేదీన కర్నూలు అశోక ఉమెన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన ఆవిష్కార్ 2కె24 సాంకేతిక సదస్సులో విద్యార్థులు ఉదయ్‌సింహ, సమీర్ సర్క్యూట్ డీబగ్గింగ్ అనే అంశానికి ప్రథమ బహుమతి సాధించారన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన రెయిన్ వాటర్ డిటెక్టర్ ప్రాజెక్ట్ ఎక్స్‌పో అంశానికి ద్వితీయ బహుమతి సాధించారన్నారు. సందర్భంగా విద్యార్థులను కళాశాల ఎండీ శివరామ్, హెచ్‌వోడీ మల్లికార్జునరావు, కోఆర్డినేటర్ శంకర్‌నాథ్ అభినందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ

నంద్యాల (కల్చరల్), మార్చి 14: నంద్యాల కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో నలుగురికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను కలెక్టర్ కె.శ్రీనివాసులు పంపిణీ అందజేశారు. నంద్యాల గాంధీనగర్‌కు చెందిన లక్కా కేశవ్‌కు లక్ష రూపాయలు, మార్తమ్మకు లక్షరూపాయలు, బనగానపల్లెకు చెందిన అబ్దుల్ హజీమ్‌కు వ్యాపారం నిమిత్తం రూ.2 లక్షలు, వైకల్యంతో బాధపడుతున్న మనురాహల్‌కు లక్ష రూపాయల చెక్కును కలెక్టర్ అందజేశారు.

'దళితబంధు పథకాన్ని మేనిఫెస్టోలో చేర్చాలి'

పాములపాడు, మార్చి 14: ఏపీలో వచ్చే ఎన్నికల్లో రాజకీయ పార్టీలు దళితబంధు పథకాన్ని మేనిఫెస్టోల్ లో చేర్చాలని మాల మహనాడు జిల్లా ప్రధాన కార్యదర్శి అంకన్న కోరారు. గురువారం పాత్రికేయుల సమావేశంలో ఆయనమాట్లాడుతూ దళితులకు తెలంగాణ రాష్ట్రంలో కుటుంబానికి రూ.10 లక్షలు అందించినట్లుగా ఏపీలో కూడా అర్హులైన దళితులకు కూడా అందించాలని కోరారు. మాలమహానాడు నాయకులు పాల్గొన్నారు.

దార సుధీర్ ప్రజలకు క్షమాపణ చెప్పాలి

● పార్టీలు, ప్రజా సంఘాల చర్చా గోష్టి

నందికొట్కూరు, మార్చి 14: వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దార సుధీర్ నియోజకవర్గ ప్రజలకు క్షమాపణలు చెప్పాలంటూ కుల సంఘాలు, వివిధ రాజకీయ పార్టీలు చర్చా గోష్టి, ర్యాలీలను నిర్వహించారు. నందికొట్కూరు మాలల నియోజకవర్గం అని ఈనెల 11వ తేదీన వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దార సుధీర్ చేసిన వ్యాఖ్యలను వారు ఖండించారు. గురువారం పట్టణం లోని ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ ఆవరణలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో వివిధ రాజకీయ పార్టీలు, కుల, ప్రజా సంఘాలతో దారా సుధీర్ చేసిన వ్యాఖ్యలపై చర్చాగోష్టి కార్యక్రమాన్ని నిర్వహించారు. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు డా.రాజు మాట్లాడుతూ దార సుధీర్ బేషరతుగా క్షమాపణలు చెప్పకపోతే ఆయన ప్రచారాన్ని అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు లాయర్ జాకీర్, వివిధ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

● దార సుధీర్ నియోజకవర్గ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ నందికొట్కూరు మండల అధ్యక్షుడు ప్రకాశం



చర్చా గోష్టిలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకుడు రాజు

మాదిగ, నియోజకవర్గ కో కన్వీనర్ అడ్డాకుల ప్రసాద్ ఆధ్వర్యంలో కొత్తబస్టాండ్ నుంచి పటేల్ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. డా.దార సుధీర్ మాట్లాడిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని, నియోజకవర్గంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ మైనార్టీలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దత్తాత్రేయ స్వామికి పూజలు

శ్రీశైలం, మార్చి 14: శ్రీశైలం మహా క్షేత్రంలో గురువారం మల్లికార్జున స్వామి ఆలయ ప్రాంగణంలోని త్రిఫలవృక్షం కింద ఉన్న దత్తాత్రేయ స్వామి వారికి లోకకల్యాణం కోసం విశేష పూజలను దేవస్థానం నిర్వహించింది. పూజా కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహా గణపతి పూజలు చేసి, అనంతరం దత్తాత్రేయస్వామికి పంచామృతాభిషేకం, విశేష పూజలు జరిపారు.

అలరించిన సంప్రదాయ నృత్యాలు



నృత్యం చేస్తున్న కళాకారులు

శ్రీశైలం, మార్చి 14: నిత్య కళారాధన కార్యక్రమంలో భాగంగా దేవస్థానం గురువారం సాయంత్రం సాయినరాజ డాన్స్ అకాడమీ, కడప బృందంతో సంప్రదాయ నృత్య ప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమంలో మహాగణపతిం, బో..శంభో, శివతాండవం, హరహర శంభో, ఓం నమఃశివాయా, అఖిలాండేశ్వరి తదితర గీతాలకు చిన్న, విజయ, చిట్టి, తేజు తదితరులు నృత్య ప్రదర్శనతో అలరించారు. స్వామి, అమ్మవార్లకు ఆయా కైంకర్యాలన్నీ పరిపూర్ణంగా జరగాలని, ప్రాచీన సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా ధర్మపథం కార్యక్రమాలను దేవస్థానం చేపడతోంది.

కురుకులాంబదేవి ఉత్సవాలు ప్రారంభం

ఆత్మకూరు రూరల్, మార్చి 14: ఆత్మకూరు మండలం కురుకుంద గ్రామంలో వెలసిన కురుకులాంబదేవి ఆలయంలో వార్షిక జయంతి ఉత్సవాలను గురువారం వైభవంగా ప్రారంభించారు. లోకకల్యాణార్థం మార్చి 14వతేది నుండి 18వ తేది వరకు నిర్వహించే ఈ ఉత్సవాలలో భాగంగా ప్రత్యేక పూజాదికార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ పురోహితులు కృష్ణమోహన శర్మ తెలిపారు. ఈ ఉత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం వేద పండితులు వెంకటా చలపతి శర్మ ఆధ్వర్యంలో కురుకులాంబ అమ్మవారికి శ్రీసూక్తఅభిషేకాలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ, అష్టోత్తర పూజలు, కలశ స్థాపన గావించారు. అనంతరం కుంకుమార్చలు, సహస్రనామ స్తోత్ర పారాయణాలు చేపట్టారు. అనంతరం వేద పండితుల ఆధ్వర్యంలో వైభ వంగా గణపతి హోమం నిర్వహించారు. నాలుగు రోజుల పాటు నిర్వహించే ఈ వేడుకల్లో చివరిరోజైన మార్చి 18వ తేదీన అమ్మవారికి అభిషేకాది క్రతువులు నిర్వహించి ప్రత్యేక అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం దంపతుల ఆధ్వర్యంలో ఆలయ ఆవరణలో చండిహోమం, పూర్ణాహుతి, మర్జానం తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

నేడు దుకాణాలకు వేలం పాటలు

కొత్తపల్లి, మార్చి 14: మండల కేంద్రమైన కొత్తపల్లిలోని స్టేట్ బ్యాంకు ఎదురుగా ఉన్న రెండు వ్యాపార దుకాణాలకు, కూరగాయల మార్కెట్‌కు వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు గ్రామ పంచాయతీ కార్యదర్శి చిన్నస్వామి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఎంపీడీవో జవహర్‌బాబు ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు స్థానిక గ్రామ పంచాయతీలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

'గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారించాలి'

కొత్తపల్లి, మార్చి 14: మండలంలోని సింగరాజుపల్లి, చిన్న గుమ్మడాపురం గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నెలకొందని, తక్షణమే పరిష్కరించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఎన్.స్వాములు, మండల ఉపాధ్యక్షులు పి. ఏసన్న డిమాండ్ చేశారు. గురువారం కొత్తపల్లిలో వారు విలేకరులతో మాట్లాడుతూ సింగరాజుపల్లిలో గతంలో ఇంటికి రూ.500 చొప్పున నిధులు సమీకరించి ఎస్సీ కాలనీ ప్రజలు సమీపంలో ఉన్న చెరువులో బావిని తీయించారన్నారు. పైపులైన్ ద్వారా ఆ బావికి అనుసంధానం చేసి అక్కడి నుంచి కాలనీలోని ఓవర్‌హెడ్ ట్యాంకు ద్వారా కాలనీవాసులకు నీరందేదని చెప్పారు. అయితే ప్రస్తుతం బావి పూర్తిగా ఎండిపోవడంతో కాలనీవాసులకు కష్టాలు తప్పడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రైవేటు బోర్లు, బావుల ద్వారా కాలనీవాసులకు తాగునీరు అందించాలని కోరారు. అనంతరం కార్యాలయ సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యంకు వారు వినతి పత్రం అందజేశారు. వీరి వెంట దేవకుమార్, జ్ఞాన సూర్యుడు, వెంకటరమణ, ధర్మరాజు పాల్గొన్నారు.

తిరుమలకు పాదయాత్ర

పాములపాడు, మార్చి 14: మండలంలోని వివిధ గ్రామాల నుంచి తిరుమలకు పాదయాత్ర చేపట్టారు. గురువారం లింగాల, పాములపాడు, రుద్రవరం, ఇస్కాల, తదితర గ్రామాల నుంచి పాదయాత్ర చేపట్టారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా పాములపాడు నుండి తిరుమల వేంకటేశ్వర స్వామి దర్శనానికి వెళ్తున్నామని చెప్పారు.

'ఎన్నికలకు సంసిద్ధం కావాలి'



నియామక పత్రాన్ని అందజేస్తున్న లక్ష్మీనరసింహ యాదవ్

నంద్యాల టౌన్, మార్చి 14: త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికలకు సంసిద్ధం కావాలని నాయకులకు, కార్యకర్తలకు నంద్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జె.లక్ష్మీనరసింహ యాదవ్ పిలుపునిచ్చారు. గురువారం డీసీసీ కార్యాలయంలో జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జీలు, కార్యవర్గ నాయకులతో సమావేశం నిర్వహించారు. అనంతరం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకొని ఎన్నికైన వారికి నియామక పత్రాలను లక్ష్మీనరసింహ యాదవ్ అందజేశారు. కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి చింతల మోహన్‌రావు, పట్టణ అధ్యక్షుడు చింతలయ్య, జిల్లా నలుమూలల నుంచి వచ్చిన కాంగ్రెస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

'దుర్భరంగా చెంచుల జీవనం'

బండిఆత్మకూరు, మార్చి 14: చెంచుల అభివృద్ధి టీడీపీ హయాంలోనే జరిగిందని, వైసీపీ పాలనలో చెంచుల జీవనం అత్యంత దుర్భరంగా మారిందని టీడీపీ సమన్వయ కర్త రామలింగారెడ్డి, సీనియర్ నాయకుడు సురేష్‌రెడ్డి, బుగ్గరాముడు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని నారపురెడ్డికుంటలో గురువారం సమావేశం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ కనీసం అటవీ ఉత్పత్తులు తెచ్చుకుని బతికేందుకు కూడా వీలు లేకుండా చేయటం బాధాకరమన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత కుంట చెరువుకు గంగనీరు మోటార్ల ద్వారా నింపే కార్యక్రమం చేపడతామన్నారు. సైకో జగన్‌ను ఇంటింకి పంపాలని పిలుపునిచ్చారు. వలంటీర్ చిన్నన్న, నారాయణపురం గతంలో వలంటీర్‌గా పనిచేసిన మధుగౌడ్ టీడీపీలో చేరారు. కార్యక్రమంలో పాల శంకర్, కొరకంచి శంకర్, రామచంద్రుడు, అంబ్రోస్ తదితరులు పాల్గొన్నారు.

మహానంది: టీడీపీ హయాంలో అధినేత చంద్రబాబు బీసీలకు ప్రాధాన్యం కల్పించారని టీడీపీ శ్రీశైలం నియోజవర్గ సమన్యయకర్త బన్నూరి రామలింగారెడ్డి అన్నారు. గురువారం మహానంది గ్రామం సమీపంలోని టీడీపీ కార్యాలయంలో గ్రామ టీడీపీ నాయకులు సూరే శ్రీనివాసులు, బి. రామచంద్రుడు ఆధ్వర్యంలో క్లస్టర్ వైజ్ జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు మధు, యూనిట్ ఇన్‌చార్జులు జనార్దన్‌రెడ్డి, నరాల మౌళీశ్వరరెడ్డి, మహానంది దేవస్థానం మాజీ ఛైర్మన్ పాణ్యం ప్రసాదరావు, క్రాంతికుమార్ యాదవ్ పాల్గొన్నారు.

'బీసీలకు రాజ్యాధికారం కల్పించిన ఘనత టీడీపీదే'

పాణ్యం, మార్చి 14: బీసీలకు రాజ్యాధికారం కల్పించిన ఘనత టీడీపికే దక్కుతుందని ఆ పార్టీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు నంద్యాల రవి అన్నారు. గురువారం పాణ్యం టీడీపి కార్యాలయంలో నిర్వహించిన బీసీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. నందమూరి తారక రామారావు బడుగు బలహీన వర్గాల కోసం టీడీపి స్థాపించారన్నారు. బీసీ డిక్లరేషన్‌కు పెద్ద ఎత్తున ఆదరణ లభించిందన్నారు. వైసీపి ప్రభుత్వం బీసీలకు అందాల్సిన 34 శాతం రిజర్వేషన్‌లను 24 శాతం తగ్గించి అన్యాయం చేసిందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 16,800 మంది బీసీలు పదవులు కోల్పోయారన్నారు. కార్యక్రమంలో నాయకులు దుర్వేశి కిట్టు, రామ్మోహన్‌నాయుడు, సుబ్బయ్య, శేఖర్‌నాయుడు, శ్రీనివాస్ యాదవ్, సుధాకర్, ఎర్రమల మద్దిలేటి, ఎల్లనాయుడు పాల్గొన్నారు.

మహానంది వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్‌గా విజయలక్ష్మి



మహానంది, మార్చి 14: మహానంది సమీపంలోని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్‌గా వి.విజయలక్ష్మిని నియమిస్తూ వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆమె గురువారం మహానంది వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్‌గా బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ డీన్‌గా విధులు నిర్వహించిన ఎస్ఎస్ నాయక్ వైస్ చాన్సలర్ టెక్నికల్ అసిస్టెంట్ ఆఫీసర్‌గా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నంద్యాల ఆర్ఏఆర్ఎస్ ప్రిన్సిపాల్ పి.విజయలక్ష్మిని మహానంది వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్‌గా బదిలీ చేశారు. అలాగే గత 16 సంవత్సరాలుగా అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా మహానంది వ్యవసాయ కళాశాలలో విధులు నిర్వహించిన ఎం. సతీష్ రాహాల్ గుంటూరు లాం ఫార్మ్‌కు, అసిస్టెంట్ శాస్త్రవేత్త సంతోష్‌రెడ్డి తిరుపతి వ్యవసాయ కళాశాలకు బదిలీ అయ్యారు.

గుండె జబ్బుల నివారణపై అవగాహన



మాట్లాడుతున్న బొజ్జా దశరథరామిరెడ్డి

నంద్యాల టౌన్, మార్చి 14: రాయలసీమ సాగునీటి సాధన సమితి ఆధ్వర్యంలో ప్రముఖ వైద్యుడు, జనవిజ్ఞాన వేదిక అధ్యక్షుడు డాక్టర్ బ్రహ్మారెడ్డి సహకారంతో గ్రామాలలో గుండె జబ్బుల నివారణపై అవగాహన సదస్సులను నిర్వహించబోతున్నట్లు సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి పేర్కొన్నారు. 'గుండెపోటు రాకుండా ఉండాలంటే ఏమి చేయాలి' అనే అంశంపై గురువారం నంద్యాలలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. బొజ్జా దశరథరామిరెడ్డి మాట్లాడుతూ రైతులకు లాభసాటి ధరలతో పాటు గుండె జబ్బుల నివాణపై సలహాలు, సూచనలు పాటిస్తే రైతులకు వైద్య ఖర్చులు తగ్గడంతో పాటు కుటుంబ ఆర్థిక పరిస్థితిని మెరుగు పరుచుకోవచ్చునని సూచించారు. డాక్టర్ బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యం పట్ల ప్రజలు అవగాహన పెంపొందించుకుంటే 80 శాతం జబ్బులకు వైద్యుల అవసరం లేకుండానే మన ఆరోగ్యాన్ని మనమే కాపాడుకోచ్చునన్నారు. హార్ట్ పెయిన్‌కు, హార్ట్ అటాక్‌కు ఉన్న వ్యత్యాసాన్ని వివరించారు. రెండు సందర్భాలలో వాటి లక్షణాలను గుర్తించిన వెంటనే ఆసుపత్రికి తరలించే లోపుగా చేపట్టాల్సిన ప్రాథమిక చర్యలను వివరించారు. సాగునీటి సాధన సమితి ఉపాధ్యక్షులు వైఎన్‌రెడ్డి, ఏర్వ రామచంద్రారెడ్డి, ప్రజాస్వామ్య పరిరక్షణ వేదిక కన్వీనర్ రామకృష్ణారెడ్డి, అల్‌మదాద్ ఫౌండేషన్ అధ్యక్షుడు రహీం, తదితరులు పాల్గొన్నారు.

'ఆర్యవైశ్యులకు రాజకీయ ప్రాధాన్యం ఇవ్వాలి'

నంద్యాల (కల్చరల్), మార్చి 14: ఆర్యవైశ్యులకు రాజకీయ ప్రాధాన్యం ఇవ్వాలని ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శి బింగుమల్ల శ్యామ్ సుందర్ గుప్తా, జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యద ర్శి. కాల్వ విజయశేఖర్, జిల్లా ఆర్యవైశ్య సంఘం గౌరవ అధ్యక్షులు ఖండే శ్యామ్‌సుందర్ లాల్ డిమాండ్ చేశారు. బాలాజి కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మామిళ్ల నాగరాజు, జిల్లా ఉపాధ్యక్షులు చంద్రశేఖర్, మలిపెద్ది నాగరాజు, శ్రీనివాస దత్తాత్రేయ, మండల కార్యదర్శి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

'సౌకర్యాలు కల్పించాలి'

ఆత్మకూరు, మార్చి 14: ఆత్మకూరు మున్సిపాలిటీతో పాటు చుట్టు పక్కల గ్రామాల్లో గల మసీదుల వద్ద రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని సౌకర్యాలు కల్పించాలని ముస్లిం మైనార్టీ నాయకులు గురువారం మున్సిపల్ కమిషనర్ హరిప్రసాద్, ఎంపీడీవో శివప్రసాద్‌వర్మకు వినతి పత్రాలు అందజేశారు. వారు మాట్లాడుతూ.. రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఆయా వార్డులు, గ్రామాల్లోని మసీదుల వద్ద ఎప్పటికప్పుడు పారిశుధ్య చర్యలతో పాటు విద్యుత్ అంతరాయం లేకుండా చొరవ తీసుకోవాలని సూచించారు. మసీదుల పరిసర ప్రాంతాల్లో వీధిదీపాలను ఏర్పాటు చేయాలని అన్నారు. నాయకులు మోమిన్ ముస్తఫా, గౌస్‌మాలిక్, గఫూర్, సలాం, ఫయాజ్ తదితరులు ఉన్నారు.

'మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి'

కొత్తపల్లి, మార్చి 14: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, ఆర్థికంగా అభివృద్ధి చెందాలని తహసీల్దార్ తిరుపతయ్య ఆకాంక్షించారు. గురువారం కొత్తపల్లి ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగేశ్వరమ్మ అధ్యక్షతన ఏసీడీపీవో మంగపల్లి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా తహసీల్దార్, జడ్పీటీసీ సోముల సుధాకర్‌రెడ్డి, సీడీపీవో కోటేశ్వరమ్మ హాజరయ్యారు. తహసీల్దార్ మాట్లాడుతూ మహిళలు ప్రస్తుత సమాజంలో పురుషులకు ధీటుగా అన్నింట్లో ముందున్నారని అన్నారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కుటుంబం ఆర్థికంగా ఎదగాలంటే స్త్రీ పాత్ర ముఖ్యమైనదని అన్నారు. అలాగే మహిళలను సన్మానించారు. కార్యక్రమంలో గోకవరం వైద్యాధికారి జుబేదా, ఏపీవో రేష్మా, కేజీబీవీ హెచ్‌ఎం, ఐకేపీ సీసీ రత్న కుమారి, మహిళ పోలీసులు, ఆయా గ్రామాల సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



లింగాల గ్రామంలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

పాములపాడు, మార్చి 14: మండలంలోని లింగాల గ్రామంలో జరుగుతున్న ఉపాది పనులను ఎంపీడీవో సరస్వతి గురువారం తనిఖీ చేశారు. మస్టరలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఉపాది సిబ్బంది సూచించిన కొలతల మేరకు పనులు చేయాలని తెలిపారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున ఉదయం పనులకు త్వరితగతిన రావాలని కూలీలకు సూచించారు. కొలతల మేరకే బ్యాంక్ ఖాతాలలో డబ్బులు పడుతాయని తెలియ చేశారు. కార్యక్రమంలో ఏపీవో విమలమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం



వెలుగోడులో కేక్ తినిపించుకుంటున్న జనసైనికులు

నంద్యాల (నూనెపల్లె), మార్చి 14: నంద్యాలలోని పద్మావతినగర్‌లో జనసేన పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం జెండాను ఆవిష్కరించారు. నంద్యాల జనసేన పార్టీ సమన్వయకర్త విశ్వనాథ్, జనసేన నాయకులు సుధాకర్, రవి, సాయి, సందీప్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, నంద్యాల అసెంబ్లీ టీడీపీ ఇన్‌చార్జీ ఎన్ఎండీ ఫరూక్, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఏవీ సుబ్బారెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తులసిరెడ్డి, ఎన్ఎండీ ఫయాజ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో టీడీపీ, జనసేన ప్రభుత్వమే వస్తుందని ఫరూక్ అన్నారు. టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆత్మకూరు: ఆత్మకూరులోని జనసేన పార్టీ కార్యాలయంలో జనసేన పార్టీ శ్రేణులు కేక్ కట్ చేసుకుని సంబరాలు జరుపుకొన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లా జనసేన పార్టీ ప్రచారకర్త కర్నాటి శ్రీరాములు, నాయకులు అరుణ్, రాజు, ఇంతియాజ్, శ్రీరామ్, మహెబూబ్, ఖాదర్‌వలి, ప్రదీప్, రాజేష్, శ్యామ్, ఉదయ్ తదితరులు ఉన్నారు.

వెలుగోడు: పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేశారు. శ్రీశైలం నియోజకవర్గం నాయకులు అభిమన్యుడు, శాలుబాషా, వలి, తిమ్మయ్య, అంజనేయులు, చంద్రబాబు, తేజ, ఖాదర్, మధుశేఖర్, ఖాదర్‌వలి, షాహిద్‌బాషా పాల్గొన్నారు.

'హామీలు అమలు చేయాలి'



ఆత్మకూరులో ర్యాలీ చేస్తున్న నాయకులు

నందికొట్కూరు, మార్చి 14: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.నాగేశ్వరరావు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు భాస్కర్‌రెడ్డి డిమాండ్ చేశారు. రైతు, వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక భరత్ కాంప్లెక్స్ నుంచి ర్యాలీగా పొట్టి శ్రీరాములు విగ్రహం సర్కిల్‌కు చేరుకొని రాస్తారోకో నిర్వహించారు. నాయకులు పక్కీర్ సాహెబ్, గోపాలకృష్ణ, నాగన్న, శ్రీనివాసులు, ఓబులేసు, కర్ణ, రామకృష్ణ, వెంకటేశ్వర్లు, ఆకుల రాము, శివ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: రైతులు పండించే పంటలకు డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ సిఫారసుల ప్రకారం కనీస మద్దతు ధరల చట్టం తీసుకురావాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం, ఏపీ రైతు సంఘం సహాయ కార్యదర్శి వెంకటేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నరసింహానాయక్, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి సుధాకర్ డిమాండ్ చేశారు. రైతు, కార్మిక, వ్యవసాయ వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఆయా సంఘాల వారు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. వివిధ సంఘాల నాయకులు రజాక్, రామ్‌నాయక్, రణధీర్ ఉన్నారు.

'నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోండి'

ఆత్మకూరు, మార్చి 14: సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని ఆత్మకూరు రూరల్ సీఐ నాగభూషణ్ సూచించారు. గురువారం ఆత్మకూరు మండలంలోని నల్లకాల్వ, బాపనంతాపురం గ్రామాల్లో బీఎస్ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ ఫంగజ్ కుమార్ నేతృత్వంలో కేంద్ర బలగాలు కవాతు నిర్వహించాయి. సీఐ నాగభూషణ్ మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో ప్రజలందరూ నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు మేమున్నామంటూ సాయుధ బలగాలు ప్రజలకు భరోసా ఇచ్చేందుకు అన్ని ప్రాంతాల్లో కవాతు ద్వారా పర్యటిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక, ఫ్యాక్షన్ గ్రామాల్లో నిఘా ఉంచనున్నట్లు వివరించారు. ఎన్నికల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించే ప్రసక్తే ఉండదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆత్మకూరు ఎస్ఐ వెంకటనారాయణరెడ్డి ఉన్నారు.

పోలింగ్ కేంద్రం తనిఖీ

ఆత్మకూరు, మార్చి 14: నల్లమల అటవీ ప్రాంతంలోని పెచ్చెర్వు చెంచుగూడెంలో గల పోలింగ్ కేంద్రాన్ని శ్రీశైలం నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ సుధారాణి పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలో కనీస సదుపాయాలను పరిశీలించారు. అలాగే అక్కడి గిరిజన విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గిరిజనులు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆమె వెంట తహసీల్దార్ కె.బాబు, సెక్టోరల్ ఆఫీసర్ నాగన్న, ఎన్నికల విభాగం సీనియర్ అసిస్టెంట్ వెంకటరమణ, బీఎల్‌వో ప్రహ్లాద తదితరులు ఉన్నారు.

'కారల్ మార్క్స్ ఆశయాలను సాధిద్దాం'

ఆత్మకూరు, మార్చి 14: జర్మనీకి చెందిన ప్రజా ఉద్యమనేత కారల్ మార్క్స్ ఆశాయాలను సాధించేందుకు ప్రజలు చైతన్యవంతులు కావాలని సీపీఎం నాయకులు ఏసురత్నం, రణధీర్, నరసింహనాయక్, స్వాములు పిలుపునిచ్చారు. గురువారం ఆత్మకూరులోని ఆ పార్టీ కార్యాలయం నందు కారల్‌మార్క్స్ 141వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. వారు మాట్లాడుతూ శ్రామిక వర్గానికి దోపిడీ నుంచి విముక్తి కల్గించేందుకు కారల్ మార్క్స్ చేసిన పోరాటం చిరస్మరణీయమని కొనియాడారు. నాయకులు వెంకటేశ్వర్‌రావు, మాబాషా, సుధాకర్, రామ్‌నాయక్, ఇస్మాయిల్, స్వాములు, సురేంద్ర, బాలయేసు, వీరన్న, కిరణ్, ఆనంద్, గణపతి తదితరులు ఉన్నారు.

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

ఘనంగా సెల్వర్‌కుత్తు ఉత్సవం



ఎగువ అహోబిలంలో సెల్వర్‌కుత్తు ఉత్సవాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు

ఆళ్లగడ్డ, మార్చి 14: అహోబిలం లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం ఎగువ అహోబిలంలో సెల్వర్‌కుత్తు ఉత్సవాన్ని వేదపండితులు ఘనంగా నిర్వహించారు. లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు ముందు రోజు ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తారు. అహోబిలంలో ఉన్న నిత్య ఉత్సవమూర్తిని 8 దిక్కులకు పరిహరణం చేయటమే సెల్వర్ కుత్తు ఉత్సవమని వేదపండితులు తెలిపారు.

వైసీపీకి ఓటమి తప్పదు

డోన్, మార్చి 14: సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీకి ఓటమి తప్పదని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామక్రిష్ణ, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్ అన్నారు. గురువారం డోన్ మండలంలోని అభిరెడ్డిపల్లె గ్రామంలో టీడీపీ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించి మేని పెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం జగన్ బటన్ నొక్కుడు తప్ప.. ప్రజలకు చేసిన అభివృద్ధి ఏమీ లేదని ధ్వజమెత్తారు. ప్రజలపై పన్నుల భారం మోపి ఆర్థికంగా తీరని నష్టం కలిగించారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దేవరబండ వెంకటనారాయణ, మిద్దెపల్లి గోవిందు, వెంకటాపురం పెద్దయ్య, రామిరెడ్డి, శ్రీనివాసులు గౌడు, ఎర్ర గుంట్ల నారాయణ, మాజీ సర్పంచ్ మద్దిలేటి, తిరుపాల్ నాయుడు, సుంకన్న, మాధవకృష్ణ పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

కొలిమిగుండ్ల, మార్చి 14: మండలంలో ఈనెల 18వ తేదీ నుంచి పదో తరగతి పరీక్షలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈవోలు అబ్దుల్ కలామ్, రాజయ్యలు సంయుక్తంగా ఒక ప్రకటనలో గురువారం తెలి పారు. కొలిమిగుండ్ల పరీక్ష కేంద్రంలో 140 మంది, ఏపీ మోడల్ స్కూల్ పరీక్ష కేంద్రంలో 120 మంది, అంకిరెడ్డిపల్లె పరీక్ష కేంద్రంలో 120 మంది, కొత్తగా ఏర్పడిన తిమ్మనాయిని పేట పరీక్ష కేంద్రంలో 60మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. పరీక్షలు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. కొలిమిగుండ్ల పరీక్ష కేంద్రంలో డిపార్టమెంటల్ ఆఫీసర్‌గా నాగేశ్వర రెడ్డి, చీఫ్‌గా ప్రసాద్, ఏపీ మోడల్ స్కూల్ పరీక్ష కేంద్రంలో డిపార్టమెంటల్ ఆఫీసర్‌గా చిన్నబా లయ్య, చీఫ్‌గా సుబ్బ లక్షమ్మ, , అంకిరెడ్డిపల్లె పరీక్ష కేంద్రంలో డిపార్టమెంటల్ ఆఫీసర్‌గా పీరా హుస్సేన్ , చీఫ్‌గా వెంకటేశ్వర రెడ్డి తిమ్మనాయిని పేట పరీక్ష కేంద్రంలో డిపార్టమెంటల్ ఆఫీస ర్‌గా వెంకట రమణయ్య, చీఫ్‌గా చంద్రశేఖ ర్‌రావులను నియమించారని, పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఎంఈవోలు తెలిపారు

బీసీల స్వయం ఉపాధికి రూ.10వేల కోట్లు

డోన్, మార్చి 14: టీడీపీ అధినేత చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీల స్వయం ఉపాధి కోసం రూ.10వేల కోట్లు ఖర్చు చేసేలా హామీ ఇచ్చారని పార్టీ రాష్ట్ర కార్యదర్శులు వై.నాగేశ్వరరావు యాదవ్, కోట్రికే ఫణిరాజ్, వలసల రామక్రిష్ణ అన్నారు. గురువారం సాయంత్రం పట్టణంలోని సాయి ఫంక్షన్ హాలు లో టీడీపీ బీసీ డిక్లరేషన్‌పై సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వై.నాగేశ్వరరావు యాదవ్ మాట్లాడుతూ వైసీపీ పాలనలో బీసీ లను పూర్తిగా అణగదొక్కారన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే బీసీలకు 50 ఏళ్లకు రూ.4వేలు పింఛన్ ఇస్తారన్నారు. వలసల రామక్రిష్ణ మాట్లాడుతూ చంద్రన్న బీమా రూ.10 లక్షలకు పెంచ డంతోపాటు పెళ్లి కానుక కింద రూ.లక్ష ఇస్తారన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసులు యా దవ్, పట్టణ పార్టీ కార్యదర్శి ఎస్ఎండీ రఫీ, రంగనాథం, మాజీ సర్పంచ్ శ్రీరాములు, గోసాని పల్లి మల్లయ్య, భూమా నాగన్న, గుండాల నారాయణ స్వామి పాల్గొన్నారు.

17న వైద్య శిబిరం

శిరివెళ్ల, మార్చి 14: శిరివెళ్లలో నంద్యాల ఆయుష్ యోగా సేవా సమితి, పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో ఉల్లి నాగేష్ కాంప్లెక్స్‌లో ఈ నెల 17న కంటి, కిడ్నీ, గుండె వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఖండె ఆనంద్ గురూజీ, ఖండె శ్యాంసుందర్ లాల్ గురువారం తెలిపారు. వారు మాట్లాడుతూ ఇప్పటి వరకు నిర్వహించిన కంటి వైద్య శిబిరాల ద్వారా 952 మందికి ఉచితంగా ఆపరేషన్లు చేయించినట్లు వెల్లడించారు. శాంతిరామ్ సూపర్ స్పెషాలిటీ వైద్యశాల వారి సహకారంతో నిర్వహిస్తున్న ఈ వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

జగన్ సభకు అవుకు జడ్పీటీసీ గైర్హాజరు

బనగానపల్లె, మార్చి 14: అవుకు వైసీపీ జడ్పీటీసీ చల్లా శ్రీలక్ష్మి గురువారం బనగానపల్లె పట్టణంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బహిరంగ సభకు గైర్హాజరు కావడం బనగానపల్లె నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి నుంచి జడ్పీటీసీకి పిలుపు అందిందా లేదా, ఒక వేళ పిలుపు అందితే ఎందుకు హాజరు కాలేదని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు. చల్లా శ్రీలక్ష్మిని ఫోన్‌లో సంప్రదించగా వ్యక్తిగత కారణాలతో సీఎం పర్యటనకు హాజరు కాలేదని ఆమె తెలిపారు.

వ్యవసాయ సలహా మండలి చైర్మన్‌గా సుదర్శన్ రెడ్డి

డోన్(రూరల్), మార్చి 14: డోన్ మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్‌గా కొత్తకోట బి.సుదర్శన్‌రెడ్డి నియమితులయ్యారు. గురువారం పట్టణంలోని వ్యవసాయ ఏడీఏ కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా బి. సుదర్శన్ రెడ్డికి సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి, రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, జడ్పీటీసీ సభ్యులు బద్దల రాజ్‌కుమార్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మల్లెంపల్లి రామచంద్రుడు శాలువలతో సన్మానించారు. ఈ కార్యక్ర మంలో డోన్ వ్యవసాయ ఏడీఏ అశోకవర్ధన్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి అబ్దుల్ షఫి, ఉద్యాన శాఖ అధికారి కళ్యాణి పాల్గొన్నారు.

‘టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి’



అఖిలప్రియ సమక్షంలో చేరిన వైసీపీ నాయకులు

చాగలమర్రి, మార్చి 14: టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ అన్నారు. గురువారం చాగలమర్రి గ్రామంలోని 19, 20 వార్డుల్లో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సూపర్-6 మ్యానిఫెస్టో గురించి వివరించారు. గుంతపాలెం వీధిలో వైసీపీకి చెందిన 40 కుటుంబాలు అఖిలప్రియ సమక్షంలో టీడీపీలో చేరాయి. ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం దుల్హన్ పథకం, రంజాన్ తోఫా, అన్న క్యాంటీన్ నిలిపివేసిందని అన్నారు. టీడీపీ హయాంలోనే ముస్లింలకు పెద్ద పీట వేశారన్నారు. కార్యక్రమంలో నాయకులు అన్సర్‌బాషా, నరసింహారెడ్డి, నల్లా నాగరాజు, గుత్తి నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

మద్యనిషేధం ఎప్పుడు?

మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి



టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేస్తున్న బీసీ జనార్దన్‌రెడ్డి

కోవెలకుంట్ల, మార్చి 14: మద్యనిషేధం చేసి ఓట్లు అడుగుతానని గతంలో మాట ఇచ్చిన సీఎం జగన్ ఆ సంగతి మర్చిపోయారని, ఇంతకూ మద్య నిషేధం ఎప్పటి నుంచి అమలు చేస్తారని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి ప్రశ్నించారు. గురువారం కోవెలకుంట్ల పట్టణంలోని గడ్డవీధి ప్రాంతంలో బీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన బాబు ష్యూరిటీ, భవిష్యత్ గ్యారెంటీ పథకంలో భాగంగా ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను ప్రచారం చేశారు. ఈ సందర్భంగా బీసీ మాట్లాడుతూ గతంలో మద్య నిషేధాన్ని అమలు చేస్తామని చెప్పిన జగన్ ప్రస్తుతం గ్రామ గ్రామాన బెల్టు దుకాణాలు ఏర్పాటుచేశారని, వాటిని యథేచ్ఛగా వైసీపీ నాయకులు నడుపుతున్నారని అన్నారు. అమ్మవడి పథకం ఇస్తూ ఇక్కడ నాన్న బుడ్డిపథకం కింద విచ్చల విడిగా మందు, సారాయి అమ్మిస్తూ పదిరెట్లు ఎక్కువ వైసీపీ నాయకులు వసూలు చేస్తూ ప్రజల ఆరోగ్యాన్ని గుల్ల చేస్తున్నారని విమర్శించారు. 2024 ఎన్నికలకు పూర్తి మద్య నిషేధం అమలు చేసి ఓట్లు అడుగుతానని ప్రగల్బాలు పలికి ఇప్పుడు ఏ ముఖం పెట్టుకొని ఓట్లు అడుగుతారని బీసీ ప్రశ్నించారు. 30 రోజుల్లో వైసీపీ పతనం కానుందని బీసీ తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ పేరా శ్రీధర్‌రెడ్డి, గడ్డం నాగేశ్వర‌రెడ్డి, బీవీ.ప్రసాద్‌రెడ్డి, కాట్రెడ్డి మల్లికార్జునరెడ్డి, సౌదరదిన్నె సుబ్బారెడ్డి, శంకరరెడ్డి, ధనుంజయుడు, దస్తగిరి, పెనుగొండరాజశేఖర్, కులాయి, గడ్డం అమరనాథరెడ్డి, మురళి తదితరులు పాల్గొన్నారు.

అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలి

- ముఖ్యమంత్రి రాజీనామా చేయాలి
- టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వై.నాగేశ్వరరావు యాదవ్



సీఎం జగన్ ఫ్లెక్సీని దహనం చేస్తున్న టీడీపీ నాయకులు

డోన్(రూరల్), మార్చి 14: ఏపీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్ ఉద్యోగాల్లో భారీ ఎత్తున అవినీతికి పాల్పడిన అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు వై.నాగేశ్వరరావు యాదవ్, కోట్రికే ఫణిరాజ్, వలసల రామక్రిష్ణ డిమాండ్ చేశారు. గురువారం సాయంత్రం పట్టణంలోని సాయి ఫంక్షన్ హాలు ప్రధాన రోడ్డులో ఈ మేరకు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. సీఎం జగన్ రెడ్డి ఫెక్సీని దహనం చేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరయాదవ్ మాట్లాడుతూ ఏపీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్ ఉద్యోగాల్లో జరిగిన అవినీతికి సీఎం జగన్ బాధ్యత వహించి రాజీనామా చేయాలని అన్నారు. టీడీపీ ప్రభుత్వం 2018 డిసెంబరు 31న 162 గ్రూప్-1 ఉద్యోగాలకు నోటిఫికేషన్ 27/2018 జారీ చేసిందని, ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ప్రిలిమ్స్ ఎగ్జామ్స్ మే 27/2019 మెయిన్స్ 2022 డిసెంబరులో నిర్వహించి వాటిలో పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడిందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఫణి, మర్రి రమణ, శ్రీనివాస్ యాదవ్, రైతు సంఘం అధ్యక్షుడు మల్లయ్య, రఫి, శ్రీనివాసులు, తెలుగునాడు పార్లమెంటు అధ్యక్షుడు అనుదీప్, అక్బర్, రాచర్ల శ్రీరాములు, మధుశేఖర్, శ్రీకాంత్ నాయుడు పాల్గొన్నారు.

‘ప్రజలు చంద్రబాబు పాలన కోరుకుంటున్నారు’



టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేస్తున్న కోట్ల నివేదిత

డోన్, మార్చి 14: టీడీపీ అధినేత చంద్రబాబు పాలన రావాలని ప్రజలు కోరుకుంటున్నారని డోన్ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి కూతురు కోట్ల నివేదిత అన్నారు. గురువారం పట్టణంలోని 22వ వార్డులో టీడీపీ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించి మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేశారు. కోట్ల నివేదిత మాట్లాడుతూ సీఎం జగన్ విధ్వంస విధానాలతో రాష్ట్ర ప్రజలు ఎంతో నష్టపోయారన్నారు. వైసీపీ నాయకుల అవినీతిని ప్రశ్నిస్తే.. దాడులు చేయడం, అక్రమ కేసులు పెట్టిస్తూ బెదిరింపులకు గురి చేయడం చాలా దారుణమన్నారు. డోన్ నియోజకవర్గ ప్రజలకు అండగా ఉండి వారి అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి పోటీ చేస్తున్నారన్నారు. టీడీపీని గెలిపించి డోన్‌ను అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోట్రికే ఫణిరాజ్, మర్రి రమణ, ఓంప్రకాష్, భాస్కర్ నాయుడు, టీఈ రాఘవేంద్రగౌడు, భాష్యం శ్రీధర్ గౌడ్, అన్వర్‌బాషా, మర్రిమణి, ఎల్లగౌడు, రజిని, ఎస్‌ఏ సరోజ, జనసేన నాయకులు ఆలా మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

ఇన్విజిలేటర్లకు శిక్షణ

చాగలమర్రి, మార్చి 14: మండలంలోని బాలుర, బాలికల, సేయింటేన్స్ పాఠశాలలో ఈనెల 18 నుంచి జరుగుతున్న పది పరీక్షలకు సంబంధించిన ఇన్విజిలేటర్లకు ఆయా పరీక్షా కేంద్రాల్లో గురువారం ఆయా పాఠశాలల సీఎస్, డీవోలు శిక్షణ ఇచ్చారని ఎంఈవో అనూరాధ తెలిపారు. గురువారం ఆయా పరీక్షా కేంద్రాల్లో ఇన్విజిలేటర్లకు పరీక్షా నియమాల గురించి వివరించారు. మూడు పరీక్షా కేంద్రాల్లో 906 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో న్యామతుల్ల, సీఆర్పీలు ఉన్నారు.

పరీక్ష కేంద్రం తనిఖీ: చాగలమర్రి వాసవీ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని ఆదోని సిట్టింగ్ స్క్వాడ్ చౌడప్ప గురువారం తనిఖీ చేశారు. పరీక్షలకు సంబంధించిన ప్రశ్నా పత్రాల రికార్డులను పరిశీలించారు. 332 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 16 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని తెలిపారు. ఆయన వెంట సీఎస్, డీవో ఉన్నారు.

బాధితుడికి బీసీ రాజారెడ్డి పరామర్శ



చిన్ననాగరాజును పరామర్శిస్తున్న మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి

బనగానపల్లె, మార్చి 14: ఇటీవల విద్యుదాఘాతానికి గురై గాయాల పాలైన మట్టా చిన్ననాగరాజును బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి గురువారం పరామర్శించారు. పట్టణంలోని పంచమ పేటకు చెందిన మట్టా నాగరాజు గ్రామపంచాయతీలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నారు. విధి నిర్వహణలో ఉండగా నాగరాజు విద్యుదాఘాతానికి గురి కావడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చిన్ననాగరాజును బీసీ రాజారెడ్డి పరామర్శించి ప్రమాద ఘటనా వివరాలు అడిగి తెలుసుకున్నారు.

గ్రంథాలయానికి పుస్తకాలు విరాళం: పట్టణంలోని ఆకుల హేమంత్ అను విద్యార్థి ఫారిన్ లాంగ్వేజీకి చెందిన పుస్తకాలతోపాటు సైన్సు పుస్తకాలు గ్రం థాలయాధికారి బషీర్ అహమ్మద్‌కు గురువారం అందించారు. గ్రంథాల యాధికారి మాట్లాడుతూ పుస్తకాలు నిరుపయోగంగా ఉంటే గ్రంథాలయాలకు అందిస్తే పది మందికి ఉపయోగపడతాయన్నారు. గ్రంథాలయంలో శాశ్వత సభ్యత్వం పొందడానికి పెద్దలు వంద, పిల్లలు రూ.50లు చెల్లించి సభ్యత్వం తీసుకోవాలన్నారు.

9 మందిపై కేసు నమోదు

శిరివెళ్ల, మార్చి 14: శిరివెళ్ల మెట్ట సమీపంలోని బుడగజంగాల కాలనీలో జరిగిన ఘర్షణలో మోతె వెంకటయ్య, దస్తగిరి, యలమర్తి సాయి, చిన్నపుల్లయ్యపై అదే కాలనీకి చెందిన 9 మంది వ్యక్తులు ఈ నెల 9వ తేదీన దాడి చేసి గాయపరిచినట్లు ఎస్ఐ సురేష్ గురువారం తెలిపారు. కర్రలతో దాడి చేశారని, క్షతగాత్రులు నంద్యాల ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారని చెప్పారు. బాధితుడు మోతె వెంకటయ్య ఫిర్యాదు మేరకు శిరిగిరి నడిపెన్న, మోతె గురుమూర్తి, సాయి కుమార్, చిన్న గురుమూర్తి, జజన్న, కొమ్మలపల్లి గురుమూర్తి, రాంబాబు, కల్యాణ్, శ్రీనుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు.

రైతు భరోసా కేంద్రం తనిఖీ

చాగలమర్రి, మార్చి 14: మండలంలోని నేలంపాడు ఆర్‌బీకే కేంద్రాన్ని ఏవో రంగనేతాజీ గురువారం తనిఖీ చేశారు. సంబంధిత రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నేలంపాడు, పెద్దబోదనం ఆర్‌బీకేలలో జొన్నల కొనుగోలుకు రిజిస్ట్రేషన్ చేస్తున్నారని తెలిపారు. మహేంద్ర జొన్నలు సాగు చేసిన రైతుల నుంచి జొన్నలు కొనుగోలు చేసేందుకు రిజిస్ట్రేషన్‌లు చేస్తున్నామని చెప్పారు. క్వింటా రూ.3,180 ప్రకారం కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు ఉన్నారు.

టీడీపీతోనే రాష్ట్రానికి భవిష్యత్తు

శిరివెళ్ల, మార్చి 14: టీడీపీతోనే రాష్ట్ర భవిష్యత్తు ముడిపడి ఉందని ఆళ్లగడ్డ నియోజకవర్గ యువ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి అన్నారు. శిరివెళ్లలోని తెలుగుపేటకు చెందిన చిలకల పెద్దరాయుడు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రామకృష్ణతో పాటు 30 కుటుంబాలు గురువారం శిరివెళ్లలో టీడీపీ నాయకులు భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి, భార్గవ్‌రామ్ నాయుడు సమక్షంలో గురువారం టీడీపీలో చేరారు. టీడీపీ మండల కన్వీనర్ కాటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రుద్రవరం: వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యం, అవినీతి ఫుల్ అని టీడీపీ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి ఆరోపించారు. మండలంలోని ముత్తలూరు మజారా నక్కలదిన్నె గ్రామంలో గురువారం బాబు సూపర్‌సిక్స్ పథకాల గురించి కరపత్రాలు ఇంటింటికీ తిరిగి అందించారు. నక్కలదిన్నె గ్రామంలో 20 కుటుంబాలు టీడీపీలో చేరాయి. కార్యక్రమంలో బంగారు రాము, ఆలమూరు నారాయణ, మాజీ సర్పంచ్ యర్రం ప్రతాప్‌రెడ్డి, రెక్కల మనోహర్‌రెడ్డి, మాల పాటి నాగేశ్వర్‌రెడ్డి, నల్లవాగుపల్లె పార్థసారథిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబాకు పూజలు



సాయిబాబాకు పూజలు చేస్తున్న భక్తులు

చాగలమర్రి, మార్చి 14: చాగలమర్రిలోని సాయినాథ మందిరంలో గురువారం సాయిబాబాకు క్షీరాభిషేకం వేద పండితుడు శ్రీనివాస్‌శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. సాయి సేవకులు సాయి బాబాకు జల, క్షీరాభిషేకాలు, సాయి వ్రతం చేశారు. అనంతరం సాయిబా బాకు పల్లకీ ఉత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహ కులు లక్ష్మీనారాయణ, సుబ్బారావు, నాగభూషణం, రఘురామ్, మహిళలు పాల్గొన్నారు.

‘బాలికా విద్యను ప్రోత్సహించాలి’



ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఉయ్యాలవాడ, మార్చి 14: ప్రతి బాలిక చదువుకునేలా ప్రోత్సహించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దీప్తి సూచించారు. గురువారం హరివరం ఉన్నత పాఠశాల విద్యార్థులతో ‘బేటి బచావో బేటి పడావో’ ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలను అరికట్టాలని సూచించారు. అక్రమ రవాణా నివారణపై, రక్షణపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినులు పార్వతి, మాధవీ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సరస్వతి పూజ



చాగలమర్రి బాలుర పాఠశాలలో సరస్వతిదేవికి పూజలు చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

చాగలమర్రి, మార్చి 14: చాగలమర్రి గ్రామంలోని బాలుర ఉన్నత పాఠశాలలో పది విద్యార్థులు గురువారం వీడ్కోలు సభను ఏర్పాటు చేశారు. వేద పండితుల ఆధ్వర్యంలో సరస్వతి దేవికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కోటయ్య, పీడీ దాదాపీర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బేతంచెర్ల: మండలంలోని మద్దిలేటి నరసింహ స్వామి క్షేత్రంలో గురువారం ఆర్ఎస్ రంగాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు సరస్వతి దేవికి పూజలు చేశారు. ఈ కార్యక్రమం ఆలయ ఈవో రామాంజనేయులు చైర్మన్ సీతారామచం ద్రుడు ఆధ్వర్యంలో జరిగింది. అనంతరం ఆలయ ఈవో చైర్మన్‌లు విద్యార్థులకు ప్యాడ్స్, పెన్నులు అందజేశారు. కార్యక్రమలో ధర్మకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి పంపిణీ



విద్యార్థులకు పరీక్ష సామగ్రిని పంపిణీ చేస్తున్న దాతలు

ఉయ్యాలవాడ, మార్చి 14: మండలంలోని మాయలూరు ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు గోవిందపల్లె గ్రామంకు చెందిన పారిశ్రామికవేత్త చామల చంద్రశేఖర్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ ఉమా కలిసి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. హెచ్‌ఎం షరీఫ్ మాట్లాడుతూ 37 మంది విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందించారని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పార్వతి, మాధవి, లలిత, రమణ, కృష్ణయ్య, సుబ్బారెడ్డి, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

పశుగ్రాసానికి భలే డిమాండ్



ట్రాక్టరుపై పశుగ్రాసం తరలిస్తున్న దృశ్యం

రుద్రవరం, మార్చి 14: పశుగ్రాసం కొరత ఏర్పడడంతో భలే డిమాండ్ ఏర్పడింది. ట్రాక్టరు పశుగ్రాసం ధర రూ.14 వేల నుంచి రూ.16 వేల వరకు పలుకుతోంది. గురువారం రుద్రవరం మండలం నరసాపురం వైపు నుంచి కడప జిల్లాకు పశుగ్రాసాన్ని ట్రాక్టర్లలో తరలించారు.

ఘనంగా జనసేన ఆవిర్భావ దినం



ఆళ్లగడ్డలో రక్తదానం చేస్తున్న యువకులు

ఆళ్లగడ్డ, మార్చి 14: పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను గురువారం ఎగుర వేశారు. జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు నడుచుకుంటామని ఆ పార్టీ ఇన్‌చార్జి ఇరిగెల రాంపుల్లారెడ్డి అన్నారు. అనంతరం జనసేన యువకులు రక్తదానం చేశారు. జనసేన పార్టీ నాయకులు విశ్వనాథరెడ్డి, రామచంద్రారెడ్డి, ప్రసాదరెడ్డి, సూర్యనారాయణరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే టీడీపీ -జనసేన పార్టీ సమన్వయకర్త మల్లయ్య పార్టీ జెండాను ఎగుర వేసి ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

చాగలమర్రి: చాగలమర్రిలోని బ్రహ్మంగారి మఠం సమీపంలో జనసేన సేవా సమితి సభ్యులు అశోక్‌కుమార్, షరీఫ్, ప్రవీణ్ ఆధ్వర్యంలో గురువారం మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం సంద ర్భంగా పవన్ కల్యాణ్ ఫ్యాన్స్ సభ్యులు రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్ర మంలో టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి గుత్తి నరసింహులు, జనసేన సభ్యులు సురేంద్ర, ప్రతాప్, హరి, చైతన్య, విష్ణు, నరేష్, రమాదేవి పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రయోజనాల కోసమే కూటమి



మాట్లాడుతున్న ఆలా మోహన్ రెడ్డి

డోన్(రూరల్), మార్చి 14: రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసం టీడీపీ, జనసేన కూటమిగా ఏర్పడిందని డోన్ నియోజకవర్గ జనసేన నాయకులు ఆలా మోహన్ రెడ్డి అన్నారు. గురువారం డోన్ జనసేన పార్టీ కార్యాలయంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం జనసైనికులతో కలిసి భవిష్యత్తు కార్యక్రమాలపై మాట్లాడారు. రాష్ట్ర అభివృద్ధి టీడీపీ, జనసేన కూటమితోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు పరదేశీ మహేష్, శ్రీకంటి మధు, ఆవుల రాజశేఖర్, పోల మధు, రాజేష్, మధు బజారి, సుధాకర్, శేషు, రామక్రిష్ణ పాల్గొన్నారు.

ఫీజులతో సంబంధం లేకుండా హాల్ టికెట్లు ఇవ్వాలి



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

బేతంచెర్ల, మార్చి 14: పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు హాజరు, ఫీజులతో సంబంధం లేకుండా వారికి హాల్‌టికెట్లు ఇవ్వాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఉదయ్ అన్నారు. గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశం మండల కార్యదర్శి ప్రదీప్ అధ్యక్షత నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత విద్యకు దూరం కాకుండా పరీక్షలకు అందరూ హాజరయ్యే విధంగా ఎలాంటి షరతులు లేకుండా హాల్‌టికెట్లు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు మనోహర్, ప్రశాంత్, ప్రసన్న, అరవిం ద్, మహ్మద్ షమీర్ పాల్గొన్నారు.

సంతాన వేణుగోపాలుడికి పూజలు

రుద్రవరం, మార్చి 14: రుద్రవరంలో సంతాన వేణుగోపాలస్వామి, సత్యభామ రుక్మిణీ అమ్మవార్లకు గురువారం పూజలు చేశారు. అర్చకులు నిత్య తృప్తదాస్ అభిషేకం నిర్వహించి పూజలు ప్రారంభించారు. భక్తులు గీతాపారాయణం చేసి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

సాయినాథుడికి.. మండలంలోని చందలూరు, రుద్రవరం గ్రామాల్లో గురువారం సాయినాధుడికి పూజలు చేశారు. చందలూరు గ్రామంలో అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు. రుద్రవరంలో సాయినాథుడి చిత్రప టాన్ని పూల మాలలతో అలంకరించారు. భక్తులు సాయినాథుడిని దర్శించుకున్నారు.

మద్యం బాటిళ్ల ధ్వంసం

ఆళ్లగడ్డ, మార్చి 14: ఆళ్లగడ్డ సెబ్ సర్కిల్ పరిధిలో పట్టుబడిన మద్యం బాటిళ్లను ఆశాఖ అధికారులు గురువారం ధ్వంసం చేశారు. ఆళ్లగడ్డ మున్సిపాలిటీ పరిధిలోని పి.చింతకుంట చెరువు వద్ద అసిస్టెంటు కమిషనర్ మధుమోహన్‌రావు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామ్మోహనరెడ్డి సమక్షంలో ధ్వంసం చేశామని చెప్పారు. వీటి విలువ సుమారు రూ.30 వేలు ఉంటుందని చెప్పారు.